గెడా రంగారావు

వ్రేలి ముద్రల ఫోర్జరీ

సుజనశ్రీ

స్ప్రింగ్ డోర్ నెట్టుకొని ఇన్‌స్పెక్టర్ రాజేంద్ర లోపలకు అడుగు పెట్టాడు, "సారధి & రామ్మూర్తి" డిటెక్టివ్ ఏజన్సీలోకి.

"హలో ఇన్‌స్పెక్టర్! చెప్పా చెయ్యకుండా ఇలా ప్రత్యక్షమయ్యారేం? అంత అర్జంటు అయితే మేమే వచ్చే వాళ్ళంకదా!" సారధి ఆశ్చర్యంతో అన్నాడు.

"అవును సార్! కాకితో కబురంపితే, రెక్కలు కట్టుకొని వచ్చే వాళ్ళం కదా! అలా కుర్చీలో కూర్చోండి సార్! బోర్నవిటా కావాలా, కూల్ డ్రింక్ కావాలా?" రామ్మూర్తి వంత పాడాడు.

వాళ్ళిద్దరి ఆదరణనూ లక్ష్య పెట్టనట్టుగా గంభీరంగా

ఉండి పోయాడు రాజేంద్ర.

"ఇంతకీ ఏం జరిగింది సార్? ఏదైనా హత్యా?" సారథి అసలు విషయంలోకి దిగాడు.

"అవును మిస్టర్ సారథి! హత్యే జరిగింది. హతుడి తల వెనుక భాగం పచ్చడి పచ్చడి అయి పోయింది! అంతే గాదు. హతుడి రక్తంలో తడిసిన వ్రేలి ముద్రలు గోడలనిండా, హత్యాయుధం మీద దొరికినయ్!"

"అవి ఎవరివో తెలిసినయ్యా?"

"తెలిసినయ్. అవి ఎవరివంటే, మిస్టర్ సారథి అనే వ్యక్తివి!"

"ఏమిటి సార్? ప్రొద్దున్నే మీరేదో జోక్ చేస్తూన్నట్టున్నారు?" రామూర్తి నవ్వాడు.

"అలా నవ్వకు! నేను సీరియస్‌గా మాట్లాడుతున్నాను! నిజానికి మరొకరు మరొకర్నయితే, ఈ పాటికి బేడీలు వేసి లాకప్‌లో వేసి ఉంచును! సారథి ఈ హత్య చేశాడని నేనూ నమ్మలేకుండా ఉన్నాను! అందుకే క్రితం రాత్రి మీరెక్కడ తిరిగారు, ఏంచేశారో చెప్పండి సారథీ!"

"ఏమిటిసార్! ఈ దారుణం! నేరాల్ని పరిశోధించి, హంతకుల్ని నేరస్థుల్ని న్యాయానికి అందించే ఒక డిటెక్టివ్ హత్య చేయటమా? అందులోనూ మోటుగా, కసిగా తల చితక్కొట్టి చంపటం! నిజానికి మా ఇద్దరిలో ఎవరికైనా హత్యచేసే అవసరమే కలిగితే పిస్టల్‌తో కాల్చి చంపుతాం కానీ యిలా కోల్డ్‌బడడ్ హత్య చస్తే చేయలేం! ఏమంటారు గురూగారూ?" రామ్మూర్తి, సారథి వంక చూశాడు.

సారథి బల్లమీద పేపర్ వెయిట్‌ని అటూ ఇటూ త్రిప్పుతూ, మౌనంగా ఉండి పోయాడు.

"మిస్టర్ సారథీ? ఇంతకీ మీరు నోరు విప్పనే లేదు!" రాజేంద్ర అతడి కళ్ళల్లోకి సూటిగా చూస్తూ అన్నాడు.

"అదే ఆలోచిస్తున్నాను ఇన్‌స్పెక్టర్! నా మీద పగబట్టిన వ్యక్తు లెవరో ఈ పని చేసి ఉండాలి! ఎవరయి ఉంటారా అని?"

"అంటే?"

"అంటే— నేను జైలుకు పంపిన నేరస్తు లెవరో ఈ మధ్యన విడుదలై ఉంటారు. అతడే ఈ హత్య చేశాడు. నేరాన్ని నా మీదకు నెట్టాడు. దాంతో అతడి శత్రువు ఒకడు చనిపోయాడు. మరొకడు ఆ నేరానికి ఉరికంబం ఎక్కుతాడు."

ఇన్‌స్పెక్టర్ రాజేంద్ర టోపీ తీసి బల్లమీద పెట్టాడు. "అదీ సంభవం కావచ్చు! కానీ నా పని నేను నెరవేర్చుకో వాలి కదా? నిన్న రాత్రి 9-30, పది గంటల మధ్య ఈ హత్య జరిగి ఉండవచ్చు. ఆ వేళలో మీరెక్కడున్నారు?"

"ఆ విషయం చెప్పబోయే ముందు మీ దృష్టికి మరో ముఖ్యమైన సమాచారం చెప్పాలి! వారం రోజుల క్రితం ఒక వ్యక్తి నా దగ్గరకు వచ్చాడు. తన పేరు లక్ష్మణ రావు అని చెప్పుకున్నాడు. తనను ఎవరో హత్య చేయటానికి ప్రయత్నిస్తూన్నారనీ, తనను రక్షించాలనీ చెప్పాడు.

"అతడు మాట్లాడుతూ తన జేబులోంచి సిగరెట్ కేస్ తీశాడు. తను సిగరెట్ వెలిగించి, నా ముందరకు

నెట్టాడు సిగరెట్ కేస్‌ని! నేను కేస్ అందుకుని, దాన్ని తెరచి సిగరెట్ తీసుకుని, కేస్ మూసేసి తిరిగి అతడి కిచ్చేశాను! అతడు నాకు సిగరెట్ కేసుని అందించ టంలో గల అంతరార్థం ఇప్పుడిప్పుడే అర్థమవు తోంది!"

"ఏమిటది?"

"నా వేలి ముద్రలు సంగ్రహించటానికి వేసిన ఎత్తు గడ ఇది!"

"అర్థం లేని మాటలు! సిగరెట్ కేస్ మీది నుంచి మీ వ్రేలి ముద్రలు హతుడి ఇంట్లోని గోడల మీదకూ, హత్యాయుధం మీదకూ ప్రాకినయ్ అంటారు?"

"అవును సార్! సరిగ్గా అంతే జరిగింది!"

"మీ కట్టు కథలు ఆపండి! నిన్నరాత్రి మీ కార్య క్రమం గురించి చెప్పండి ఇకనైనా?" అని అరిచాడు ఇన్స్పెక్టర్ రాజేంద్ర.

2

సారథి సిగరెట్ వెలిగించాడు. ఇన్స్పెక్టర్‌కి మరో సిగరెట్ ఆఫర్ చేశాడు. ఇద్దరూ నాలుగు దమ్ములు లాగాక ఇద్దరిలోనూ టెన్షన్ కొంత తగ్గింది.

"ప్రఖ్యాత రాజకీయనాయకుడు, యం. యల్. ఎ. అయిన గుప్తాగారింట్లో రాత్రి పార్టీ జరిగింది. బహుశా మీకు ఆహ్వానం వచ్చి ఉండాలే!" సారథి నింపాదిగా చెప్పాడు. అతడిలో ఏ విధమైన ఉద్వేగమూ లేదు.

"అవును! నాకూ ఆహ్వానం వచ్చింది. కానీ మా బంధువు లింట్లో వివాహానికి హాజరు కావాల్సి ఉండటం మూలాన, నేను పార్టీకి రాలేక పోయాను" ఇన్స్పెక్టర్ రాజేంద్ర తలూపాడు.

"రాత్రి తొమ్మిదిన్నరకు కాబోలు మేం పార్టీకి వెళ్ళే సన్నాహంలో ఉండగా, మాకు ఫోన్ కాల్ వచ్చింది. మాకు కొత్త క్లయింట్ ఒకాయన తగిలాడులె వారం రోజుల క్రితం. అతడు తననెవరో హత్య చేయటానికి యత్నిస్తున్నారనీ, తనకు రక్షణ కల్పించమనీ కోరాడు. అతగాడికి అనుమానం వేసినప్పుడు మాకు ఫోన్ చేయమన్నాం!

"అలాగే అతడు రాత్రి, మేం ప్రయాణ సన్నాహంలో ఉండగా ఫోన్ చేశాడు. ఆటో రిక్షాలో మేం బయలుదేరాం, అతడి చిరునామాకు. సగం దోవలో ఒక కారు వేగంగా దూసుకు వచ్చి, మాకు అడ్డంగా ఆగింది. ఎవరో మమ్మల్ని అటకాయించబోతున్నారని మేం కారులోని వ్యక్తుల్ని ఎదుర్కోబోయాం.

"కారులోంచి యం. యల్. ఏ. గారి బావమరిది దిగాడు. పార్టీ మొదలవబోతున్నదనీ, సారథ్, రామ్మూర్తిల్ని దగ్గరుండి తీసుకురమ్మని గుప్తాగారు ప్రత్యేకంగా పంపారనీ చెప్పాడు. మేము మరో అరగంటలో వస్తామన్నా వినలేదు అతగాడు. చేసేది లేక కారులో ఎక్కాం."

"అంటే 9-30 నుంచీ పార్టీ అయిపోయేదాకా మీరు గుప్తాగారింట్లో నుంచి బయటకు రాలేదా?"

"లేదు! పార్టీ అయిపోయేక మళ్ళీ కారులో మా ఇంటి దగ్గర గుప్తాగారి బావమరిది దిగబెట్టి వెళ్ళాడు. అప్పటికి టయిమ్ ఒంటి గంట కావస్తున్నది."

"గుప్తాగారినీ, ఇతర అతిధుల్నీ ప్రశ్నించి ఆ విషయం తెలుసుకుంటాం! కానీ మీ వ్రేలి ముద్రలు హంతుడి

ఇంట్లో గోడల మీదా, హత్యాయుధం మీదా ఎలా వచ్చినయ్!"

"అవి ఎలా వచ్చినయ్యో నాకు తెలుసు! కానీ మీరు నా మాటల్ని నమ్మక పోవచ్చు!"

"అంటే? ఏమిటి మీరనేది?"

"వ్రేలి ముద్రలు ఫోర్జరీ చేయబడ్డయ్!"

"అద్భుతం! అత్యద్భుతం సారథీ! సంతకాలు ఫోర్జరీ చేయటం గురించే నాకు తెలుసుగానీ, వ్రేలి ముద్రల ఫోర్జరీ బహుశా మీరు సృష్టించి ఉంటారనుకుంటాను! నాతో పరాచికాలాడటానికి ఇప్పుడే సమయం దొరికిందా మీకు?" ఇన్‌స్పెక్టర్ రాజేంద్ర చిరాకుగా అన్నాడు.

"లేదు ఇన్‌స్పెక్టర్! నేను చెప్పేది నిజం! కావాలంటే చూడండి!" అంటూ సొరుగులో పుస్తకాలు వెదికి, వాటి మధ్యలోంచి అమెరికన్ జర్నల్‌ని ఒకదాన్ని తీసి ఇన్‌స్పెక్టర్ ముందు పడేశాడు సారథి.

ఇన్‌స్పెక్టర్ రాజేంద్ర అందులో పేజీలు తిరిగేశాడు. "నమ్మశక్యం గాకుండా ఉందే! ఇంతకీ వ్రేలి ముద్రల్ని ఫోర్జరీ ఎలా చేస్తారంటారు?" జర్నల్‌లో వ్యాసం చదివే ఓపికా, విరామమూ లేని ఇన్‌స్పెక్టర్ అడిగాడు.

"చాలా సింపుల్! సిగరెట్ కేస్ గాని, నీళ్ళగ్లాసు గానీ మనం పట్టుకున్నప్పుడు మనచేతి వ్రేలి ముద్రలు వాటిమీది స్పష్టంగా పడతాయి. వాటిని జాగ్రత్తగా తీసుకు వెళ్ళి, వాటికి సరిపోయేలా మైనం మీద 'మోల్డ్' తయారుచేసి, మైనాన్ని గట్టిపరుస్తారు. గ్రామఫోన్ రికార్డు మీద సన్నని గీతల్ని రికార్డు చేసినట్టే!"

"అయితే హంతకుడెవరో చాలా పకడ్బందీగా, ముందే వేసుకున్న పథకం ప్రకారం హత్య చేశాడు!

సరే! మీరు నాతో రావాలి! గుప్తాగార్ని కలుసుకుని వద్దాం! నా డ్యూటీ ప్రకారం ఎంక్వైరీ పూర్తి చేయాలి గదా?"

"అలాగే సార్! మీతో సహకరించటానికి మేం ఎప్పుడూ సంసిద్ధులమే!" అంటూ సారధి కుర్చీలోంచి లేచాడు.

పోలీసు జీప్ యం. యల్. ఏ. గారింటి ముందు ఆగింది.

"ఓ! ఇన్‌స్పెక్టర్ గారా? నిన్న పార్టీకి రాకుండా తప్పించుకుని ఇప్పుడు వస్తున్నారా?" నిష్టూరమాడాడు గుప్తా.

"క్షమించండి! బంధువులింట్లో వివాహం ఉండటం వలన రాలేక పోయాను! పోతే మీనుంచి చిన్న సమాచారం కావాలి సార్! సారధి మీ ఇంటికి పది గంటలకు వచ్చానని చెపుతున్నాడు. అప్పటినించి, పార్టీ అయిపోయేదాకా అతనిక్కడే ఉన్నట్టు రూఢిగా చెప్పగలరా?"

"ఖచ్చితంగా చెప్పగలను. 9-15 దాకా సారధి రాకపోయేసరికి నేనే మా బావమరిదిని పంపాను కారిచ్చి, వాళ్ళను తీసుకువచ్చేందుకు. క్రితం ఏడాది మా ఇంట్లో జరిగిన దొంగతనం కేసులో సారధి పరిశోధించి దొంగని పట్టుకున్నాడు. పోయిన డబ్బు చాలా భాగం దొరికింది. అప్పట్నుంచి ఆయనా, ఆయన అసిస్టెంటూ మా ఆప్తుల్లో వారయారు!"

"పార్టీ జరిగినంత సేపూ అతడు మీ కళ్ళెదుటే ఉన్నాడా?"

10

"మీ పోలీసులకు ప్రతిదీ అనుమానమే సార్! అతడు నా ప్రక్కనే ఉన్నాడు. నేను స్వాగతం చెప్పిన అతిథులతో ఛలోక్తిగా మాట్లాడుతూ వాళ్ళను ఉల్లాస పరిచాడు కూడాను!"

"మీ ఇంట్లో పార్టీకి హాజరయిన ఒకరిద్దరు ముఖ్య అతిథుల్ని పేర్కొనగలరా?"

గుప్తా వారిలో మూడు నాలుగు పేర్లు సూచించాడు. ఇన్‌స్పెక్టర్ రాజేంద్ర నోట్‌బుక్‌లో వాటిని రాసుకున్నాడు.

పోలీస్ జీప్ మళ్ళీ బయలుదేరింది.

"మీ వద్దకు ఈ మధ్యనే ఎవరో వ్యక్తి వచ్చాడన్నారే? అతడి సమాచారం చెప్పండి సారధి!"

"అతడి పేరు లక్ష్మణరావు. స్టాక్ బ్రోకర్‌నని చెప్పుకున్నాడు. అతడు నివశించేది నుంగంబాకంలో. డాక్టర్ మురళీధర్ ఇంట్లోని గ్యారేజీ అతడి నివాసం అట!"

"నిజంగా! అతడి పేరు లక్ష్మణరావు కాదు! రామారావు. అతడే ఇప్పుడు హత్య చేయబడింది!" ఇన్‌స్పెక్టర్ ఆశ్చర్యంతో అరిచాడు.

"అయితే అతడు నాతో మారుపేరు చెప్పి ఉండవచ్చు! అతడ్ని చంపుతానని బెదిరిస్తూ ఒక జాబు వచ్చిందట! దాన్ని నాకూ చూపించాడు; అతడి ఇంటి వద్ద రెండు మూడు రోజులు నిఘా ఏర్పాటు చేశాం! లక్ష్మణరావు ఉదయం ఎనిమిది గంటలకు బయటకు వెళ్ళేవాడు. రాత్రి ప్రొద్దు పోయాక ఇల్లు చేరుకునేవాడు!"

"అతడు స్టాక్ మార్కెట్‌లో తీరిక లేకుండా ఉండేవాడనుకుంటాను!" ఇన్‌స్పెక్టర్ అడిగాడు.

"ఒకరోజు అతడి దినచర్యనూ గమనించాం! అతడు ఎక్కువగా పార్కుల్లోనే గడిపేవాడు. చెట్ల నీడల్లో పడుకుని నిద్రపోయే వాడు. మొదటి షో సినిమాకు విధిగా ప్రతిరోజూ హాజరయేవాడు!"

"మరి అతడి పోషణకు ఆదాయం ఎక్కడ్నుంచి వచ్చేదో?"

"అదే అర్థం కావేదు! ఒకసారి, మనం అతడి ఇల్లు చూసి వద్దామా సార్!" సారథి అడిగాడు.

"దానిదేముంది? అలాగే పోదాం!"

జీప్ మరో దారిన మళ్ళింది.

మార్చ్యురీలో శవాన్ని చూశారు.

"ఇతడే నా వద్దకు వచ్చిన లక్ష్మణరావు!" అన్నాడు సారథి.

"ఇతడి అసలు పేరు రామారావు! మీతో అతడు అబద్ధమాడే ఉండాలి!" రాజేంద్ర నిదానంగా చెప్పాడు.

రామారావు ఉరఫ్ లక్ష్మణరావు ఇంటికి దారితీశారు అందరూ.

విశాలమైన ఆవరణలో మధ్యగా పెద్ద బంగళా ఉంది. అందులోనే డాక్టర్ మురళీధర్ నివసిస్తున్నాడు. ఒక మూలగా గ్యారేజీ ఉంది. దానికి పెద్దరేకు గేటు ఉంది. ఆ గేటు రోడ్డు మీదకే ఉండటం మూలాన, గ్యారేజీ లోకి రాకపోకలు, బంగళాలో వ్యక్తులకు కనబడవు.

గ్యారేజీకి కాపలాకాస్తూన్న కానిస్టేబుల్ ఇన్‌స్పెక్టర్‌కి సెల్యూట్ చేశాడు.

గేటు తెరిచి ఇన్‌స్పెక్టర్ రాజేంద్ర, సారథి, రామ్మూర్తి లోపలకు ప్రవేశించారు. గోడల నిండా సినిమా

తారల క్యాలెండర్లు తగిలించి ఉన్నయ్.

ఒక మడత మంచం, మరో మూల కుర్చీ, టేబుల్ వున్నాయ్. టేబుల్ మీద డిటెక్టివ్ నవలలున్నయ్ చిందర వందరగా.

గ్యారేజీ మధ్యగా చెక్కలతో పార్టీషన్ ఉంది. దాని కవతల స్టవ్వూ, నాలుగైదు స్టీలు గిన్నెలూ, రెండు కూజాలూ ఉన్నాయ్.

"ఇంతకీ ఇక్కడ హత్య జరిగినట్టుగా ఎవరు గమనించారు ముందుగా!"

"రాత్రి బీట్ కానిస్టేబుల్ ఈ ప్రాంతంలో తిరుగుతుండంగా, ఈ గ్యారేజీ లోంచి ప్రేలుడు వినబడిందట. అతగాడు డాక్టర్ గారిని మేలుకొలిపి గ్యారేజీ తెరిపించి చూశాడు. లక్ష్మణరావు నెత్తురు మడుగులో పడి ఉన్నాడట!"

"అంటే హంతకుడే ఆ ప్రేలుడిని ఏర్పాటు చేసి ఉండాలి తను వెళ్ళిపోతూ. అతగాడు వెళ్ళిపోయిన కాసేపటికి ప్రేలుడు సంభవించగానే, చుట్టు ప్రక్కల వాళ్ళు పరుగెత్తి వచ్చి, హత్య జరిగిన విషయం చూడాలని అతడి పథకం!"

సారథి గ్యారేజీలోని డ్రాయరూ, పుస్తకాల అరా వెదుకసాగాడు.

"దేనికోసం మీరు వెదికేది?"

"హతుడి బ్యాంకీ ప్యాస్ పుస్తకం కోసం చూస్తున్నాను!"

లావాటి బైండు పుస్తకంలో దాచిపెట్టబడి ఉన్న ప్యాస్ బుక్ని బయటకు లాగాడు సారథి.

ఆంధ్రా బ్యాంకు సేవింగ్స్ ప్యాస్‌బుక్ అది. గత ఆరు నెలలుగా, నెలకు వెయ్యి రూపాయలు చొప్పున జమ కట్టబడి ఉంది. విత్‌డ్రాయల్స్ అసలు లేవు.

పుస్తకాన్ని ఇన్‌స్పెక్టర్ చేతికిచ్చాడు సారథి, తర్వాత గోడ మీది వ్రేలిముద్రల్ని భూతద్దంతో పరీక్షగా చూశాడు చాలాసేపు.

"ఇన్‌స్పెక్టర్! ఈ వ్రేలిముద్రల్లో ఒక పెద్ద లోపం ఉంది. కనిపెట్టారా?"

"నేను వాటిని పరీక్షించలేదు! ఏమిటా లోపం మీరే చెప్పండి!"

"వ్రేలి ముద్రలు ఏవీ పూర్తిగా పడలేదు. ప్రతిముద్ర లోనూ ఏదో మూల విరిగి పోయిన గుర్తులు కనుపిస్తున్నాయి!"

"ఏదీ!నన్ను చూడనివ్వండి!" ఇన్‌స్పెక్టర్ రాజేంద్ర భూతద్దం తీసుకుని పరీక్షగా చూశాడు. సారథి చెప్పింది నిజమేనని ఒప్పుకున్నాడు.

ఆ బంగళా ఓనర్ డాక్టర్ మురళీధర్ అప్పుడే లోపలకు వచ్చాడు. "ఓ! ఇన్‌స్పెక్టర్ గారా? హంతకుడి ఆచూకీ ఏమైనా దొరికిందాండీ?"

"ఏదీ ఇంకా కేసు పరిశోధనలోనే ఉందండీ! అన్నట్టు చనిపోయిన రామారావు ప్రవర్తన ఎలాటిదో చెబుతారా?"

"అతడు ఎప్పుడూ ఇంటి పట్టున ఉండే వాడు కాదండీ! ఉదయం ఎనిమిది గంటలకు బయటకు వెళ్ళి పోయేవాడు. రాత్రి పొద్దు పోయాక వచ్చేవాడు. ఈ ఇంటి ఆవరణలో మాత్రం ఏనాడూ అల్లరి చిల్లరి పనులు చేయలేదు." డాక్టర్ మురళీధర్ చెప్పాడు.

"అద్దె క్రమంగా నెలనెలా ఇచ్చేవాడా?" సారథి అడిగాడు.

"చేరిన కొత్తలో, ఆరునెలల అద్దె బకాయి పడ్డాడు. గ్యారేజీ ఖాళీ చెయ్యమన్నాం! ఒక్క నెల గడువివ్వమని ప్రాధేయ పడ్డాడు. అలాగే నెల తిరిగే లోపల ఆరునెలల అద్దె చెల్లించేశాడు. తర్వాత నుంచీ ఏనెల అద్దె ఆ నెలే ఇచ్చేశాడు."

సినిమా తారల క్యాలెండర్ల మధ్యగా, పెన్సిల్‌తో ఏదో నెంబరు కనిపించీ కనిపించకుండా వుంది. సారథి దాన్ని నోట్ చేసుకోమని రామ్మూర్తికి సంజ్ఞ చేశాడు.

"మీ పరిశీలన పూర్తి అవుతే, మిమ్మల్ని మీ ఆఫీసు దగ్గర డ్రాప్ చేసి, నేను స్టేషన్‌కి వెళతాను!" రాజేంద్ర ఆ ఇద్దరి వంకా చూస్తూ అన్నాడు.

"మేం రెడీసార్!"

జీప్ వెళ్తూన్నప్పుడు సారథి మళ్ళీ మా నాన్ని చీలుస్తూ అన్నాడు. "రాజేంద్ర గారూ? రామారావుకి అంత డబ్బు ఎలా వచ్చిందంటారు?"

"బహుశా స్టాక్ ఎక్స్చేంజి మీద కమీషన్ సంపాదించాడేమో!"

"అది అంత తేలికైన పని కాదు! రామారావు చేసే వ్యాపారం బ్లాక్ మెయిల్. ఆరునెలల నుంచి అతడు ఎవరో డబ్బున్న వ్యక్తిని బ్లాక్ మెయిల్ చేసి డబ్బు గుంజుతున్నాడు. సగం వాడుకుని సగం బ్యాంకిలో వేసుకున్నాడు!"

"ఆరి పిడిల్లు వాన గురవా !"

"అంతే గాదుసార్! బ్లాక్ మెయిల్ చేయబడుతున్న వ్యక్తి ఇతడ్ని శాశ్వతంగా వదిలించుకునేందుకు మాంఛి

పథకం వేసుకున్నాడు! అతడెవరోగానీ, నాకూ బద్ధ శత్రువు అయి ఉండాలి! అందుకే రామారావుని హత్య చేసి, ఆ నేరాన్ని నామీదకు నెట్టాడు. ఒక దెబ్బకు రెండు పిట్టలు తా!"

"మీమీద అంత విరోధం పెంచుకునే వారెవరబ్బా?"

"వాడెవడో స్మగ్లరో, చీకటిబజారు వ్యాపారస్థుడో అయి ఉంటాడు. వాడెవరయిందీ రేపీ పాటికి ఆరా తీయనూ?" సారధి పెదవిని కొరుకుతూ అన్నాడు.

3

ఫ్రిజ్ లోంచి విస్కీ సీసా తీసి గ్లాసులోకి వంచుకున్నాడు రామ్మూర్తి.

సారధి సిగరెట్ త్రాగుతూ అటూ ఇటూ గదిలో పచార్లు చేస్తున్నాడు.

"రామ్మూర్తీ! టెలిఫోన్ డైరక్టరీ వెదుకు. నీవు నోట్ చేసుకు వచ్చిన నెంబరు ఎవరిదో చూడు!"

రామ్మూర్తి ఎగిరి గంతేసి డైరక్టరీ అందుకున్నాడు. దాన్లో పేజీలు తిరగేశాడు. "హరి భగవంతుడా! ఆ నెంబరు ఎవరి దనుకున్నారు గురో? ప్రఖ్యాత బిజినెస్ మాగ్నెట్ లక్షాధికారి రాజారావుది!"

"అంటే బంగారు వ్యాపారం, బియ్యం, అపరాల వర్తకం, టెక్స్టయిల్ మిల్ ఉన్న రాజారావేనా?"

"అవునండీ! అతడే! అతడికెన్ని వ్యాపారాలున్నాయో లెక్క వేయాలంటే అరగంటకు తక్కువ పట్టదు?"

"అతడికీ ఈ రామారావుకీ ఏమిటి సంబంధం?"

"పోనీ ఏదో పాట్లకాయ పొరుగులాటి సంబంధం

ఉన్నదే అనుకుందాం? ఈ రాజారావుకీ మనకీ మధ్య శత్రుత్వం ఎందుకు రావాలి?" రామ్మూర్తి మరో ప్రశ్న వేశాడు.

"అన్నట్టు మనం గత ఏడాది నుంచీ చేపట్టిన కేసుల్ని నెమరువెయ్యి! చట్టానికి విరుద్ధంగా ప్రవర్తించి, మన పరిశోధనవల్ల పట్టుబడి జైలు కెళ్ళిన వాళ్ళందర్నీ ఒకసారి గుర్తు తెచ్చుకో!"

రామ్మూర్తి అరగంటసేపు ఫైళ్ళతో కుస్తీ పట్టాడు.

"ఆఁ! దొరికింది సార్! పదినెలల క్రితం విదేశీ సరుకుల్ని చేరవేస్తున్న ఒక వ్యాపారస్తుడ్ని జైలుకు పంపాం గుర్తుందా సార్? అతడి పేరు అహమ్మద్ ఖాన్! అతడితో ఈ రాజారావుకి వాటా ఉందని విన్నాం! కానీ రాజారావు తన పలుకుబడి ఉపయోగించి, తనకతనితో ప్రమేయమే లేదన్నాడు!"

"కరెక్ట్! చూస్తూ చూస్తూ లక్ష రూపాయల సరుకు ప్రభుత్వం స్వాధీనం అయిపోయింది. పైగా అతడికి నమ్మకంగా పనిచేసే అహమ్మద్ ఖాన్ జైలుకు పోయాడు. ఏదో పార్టీలో రాజారావుకి మనల్ని పరిచయం చేశారెవరో! అప్పుడతగాడు మనల్ని కొరకొర చూశాడు."

"అవునుసార్! తప్పకుండా ఇది అతడి పనే అయి ఉంటుంది. మనకు దొరికిన నెంబరుకు ఫోన్ చేసి చూద్దాం గురూ?"

"తప్పకుండా చేయి! రాజారావు ఈ క్షణంలో ఎక్కడున్నదీ కనుక్కో!"

రామ్మూర్తి టెలిఫోన్ ముందు కూర్చుని బిజీ అయిపోయాడు.

"రాజారావు ప్రస్తుతం ఊళ్ళో లేడట. కాటన్ మిల్ కి వెళ్ళి రెండు రోజు లయిందట!"

"చూశావా? హత్య జరిగిన సమయంలో తను ఊళ్ళో లేనట్టుగా గట్టి ఎలిబీ సృష్టించుకున్నాడు!" సారథి కనుబొమ్మ లెగరేశాడు.

"ఇవాళ సాయంత్రం మద్రాసు చేరుకుంటాడట! అతగాడి కాటన్ మిల్ మద్రాసు సిటీ లిమిట్స్ దాటాక అదేదో పల్లెలో ఉంది కదూ?"

"అవును! సాయంత్రం రాజారావుని కలవాలి!"

"మీరా? చూస్తూ చూస్తూ ఒంటరిగా వెళ్ళి హంతకుడి కెదురు పడతారా? పులి నోట్లో తల దూర్చటమే!" రామ్మూర్తి ఆదుర్దాగా అడిగాడు.

"పులినోట్లో తల దూర్చేది నేను కాదు రామ్మూర్తీ! నాతో ఎప్పుడు భేటీ వేసుకున్నాడో ఆ క్షణంలోనే రాజారావు పులి నోట్లో తల పెట్టాడు!" సారథి కసిగా అన్నాడు.

4

సాయంత్రం అయేసరికి సారథి, రామ్మూర్తి ఇద్దరూ రాజారావు అండు కో ఆఫీసుకు వెళ్ళారు.

"రామ్మూర్తీ! నీవు క్రిందనే ఉండు! నేను మేడ మీదికి వెడతాను! అరగంటలో నేను తిరిగి రాకపోతే నీవూ పైకిరా!"

"అలాగే! బహుశా నీవి పాటికి అరెస్టుకాబడి, జైల్లో ఉండి ఉంటావని కలలు గంటూ ఉంటాడు రాజారావు! నిన్ను చూడంగానే గుండె ఆగి మరణిస్తాడేమో!"

"వాడంత సులభంగా చావడు లే! మన చేతికి చిక్కి ఉరికంబానికి ఎక్కద్దూ?" అంటూ సారథి లిఫ్టులో ఎక్కి మేడలో నాలుగో అంతస్థులోకి వెళ్ళాడు.

గుమాస్తాలూ, టైపిస్టులూ, అకౌంటెంట్లతో క్రిక్కిరిసి ఉన్న మూడు గదుల్నీ దాటుకుని వెళ్ళాక మేనేజింగ్ డైరక్టర్ అని ఎయిర్ కండిషన్డ్ గది మీద బోర్డు కనిపించింది. ఆ గది వాకిలికి ప్రక్కగా పర్సనల్ సెక్రటరీ కూర్చుని ఉంది. గాడ్రెజ్ టేబులు, మూడు టెలిఫోన్లూ, ఇంటర్ కమ్ ఉన్నయ్ ఆమె ముందు.

"చూడు మిస్! నేను రాజారావుగారిని అర్జెంటుగా చూడాలి!"

"మీకు ఇంటర్వ్యూ అనుమతి ఉందా?" సెక్రటరీ కర్కశంగా అడిగింది.

"లేదు! అయినా నేను వచ్చినపని చాలా అర్జెంట్!"

"అదేం లాభం లేదండీ? ముందే అనుమతి పొంది ఉండకపోతే, మీకు ఇంటర్వ్యూ దొరకదు!" నిష్కర్షగా చెప్పేసింది సెక్రటరీ.

బల్లమీది టెలిఫోను మ్రోగడంతో "యస్ ప్లీజ్! రాజారావ్ అండ్ కో!" అంది సెక్రటరీ.

అసలీమెను తను పర్మిషన్ కోసం ఎందుకడిగానా అనుకున్నాడు సారథి. ఆమె ఫోన్లో మాట్లాడుతూ తన పట్ల శ్రద్ధ చూపడం లేదని గ్రహించాడు అతడు. అతి నిర్లక్ష్యంగా, పెద్ద పెద్ద అంగలతో ఎయిర్ కండిషన్డ్ గది సమీపించి, కన్ను మూసి తెరిచేంతలోగా గది తలుపు నెట్టుకొని, లోపలకు జొరబడ్డాడు సారథి.

"ఏయ్ ఆగు! ఏమిటీ దౌర్జన్యం!" అంటూ వెనుక సెక్రటరీ అరుపులు తలుపు మూయటంతో వినబడకుండా పోయినయ్.

నేలమీద ఎర్రని తివాసీ, గదిలో చల్లదనం, ట్యూబ్

లైట్ల కాంతిలో నిండైన టేబుల్ ముందు రివాల్వింగ్ చైర్‌లో కూర్చుని ఏదో ఫైలు తిరగేస్తున్నాడు రాజారావు.

"ఏయ్! ఏమిటిది? నిన్ను లోపలకు ఎవరు రానిచ్చారు?" సారథిని చూస్తూనే అరిచాడు రాజారావు.

"ఒకళ్ళు రానిచ్చేదేమిటి? నేను రావాలనుకున్నాను! వచ్చాను. అంతే! అన్నట్టు నన్ను పరిచయం చేసుకోలేదు కదూ? నా పేరు సారథి. ప్రైవేట్ డిటెక్టివ్! మనం లోగడ ఒకసారి పార్టీలో కలుసుకున్నాం!"

"అబ్బో! పెద్ద గవర్నర్‌లా దర్పం ఒలకబోస్తున్నావే? ఇంతకీ నాతో ఏమిటి నీకు పని?" అతడి కళ్ళల్లో భయం కొట్టొచ్చినట్టుగా కనిపిస్తోంది.

"అన్నట్టు మీ పార్టనర్ అహమ్మద్ ఖాన్ జైలు నుంచి విడుదల అయ్యాడా? ఇంకా లేదా? మీ కంపెనీల్లో ఏవో అవకతవక లున్నట్టు మాకు అనుమానం తోస్తున్నది సుమా!"

"నోరు మూసుకు బయటకు పోతావా? లేక..."

"నీ కంత శ్రమ అక్కర్లేదు మిస్టర్ రాజారావ్! రెండు నిముషాలు మాట్లాడి వెళ్ళిపోతాను అంతే!"

"అసలు నీవీ పాటికి జైల్లో ఉండాల్సిందే! ఇంకా బయట ఉన్నావెందుకు?" రాజారావు ఆశ్చర్యంగా చూశాడు.

"ఎందుకు? నేనేం నేరం చేశానని?" సారథి అమాయకంగా అడిగాడు.

"ఎందుకా? రామారావు అనే వ్యక్తిని హత్యచేసినందుకు!" సంతోషంగా అన్నాడు రాజారావు.

దొంగ దొరికాడురా అనుకున్నాడు సారథి!

"అవునూ! రామారావు హత్య గురించి ఇంకా పేపర్లో పడనే లేదు! నీదాకా ఎట్లా వచ్చింది అప్పుడే! అంటే నేను నిన్ను అనుమానించినట్టే జరిగింది. రామారావుని హత్య చేసింది నీవే ముమ్మాటికీ?"

"నీకేమన్నా మతి పోయిందా? లేక తాగొచ్చావా? నేనేమిటి? హత్య చేయడం ఏమిటి? అసలు నీతో నాకేంపని!" అంటూ టేబుల్ మీద కాలింగ్ బెల్‌ని రెండుసార్లు నొక్కాడు రాజారావు.

తలుపు తెరుచుకుని ఆజానుబాహువొకడు లోపలకు వచ్చాడు. "రాంసింగ్! ఈ వెధవని ఎత్తి, నాలుగో అంతస్తులోంచి క్రిందికి విసిరెయ్!" అని అరిచాడు రాజారావు.

ఆ వ్యక్తి వంక భయంగా చూశాడు సారథి. అతను తనను సమీపించంగానే, కరాటీ ఉపయోగించి అలవోకగా అతడ్ని చేతుల మీద పైకెత్తి వాకిలి వేపు విసిరేశాడు.

తలుపు తోసుకుని వెళ్ళి ఆ వ్యక్తి అవతలి గదిలో పడ్డాడు.

"మిస్టర్ రాజారావ్! నువ్వొకడివే తెలివిగలవాడివని అనుకోకు! ఇంకా నీ బాడీ గార్డు లెవరన్నా ఉంటే రమ్మను! నా తడాఖా చూపిస్తాను!" అన్నాడు సారథి.

రాజారావు డ్రాయరు బయటకు లాగాడు. అందులోంచి రివాల్వర్‌ని తీసి సారథికోసం చూశాడు. అప్పటికే సారథి ఎలివేటర్‌లో క్రిందకు చేరుకున్నాడు.

తనకూ, రాజారావుకీ మధ్య జరిగిన సంభాషణ అంతా చెప్పాడు, రామ్మూర్తిని కలుసుకోగానే.

"ఇదివరకు మనం కేవలం ఊహించినది ఇప్పుడు నిజమని తేలిపోయింది. పేపర్లో పడకుండానే, రామారావు హత్య గురించి అతగాడికి ఎలా తెలిసింది? కనుక అతడే హంతకుడు!"

"కానీ నీవంత బాహాటంగా యితడి ఎదుట పడటం అంత మంచిది కాదేమో! ఈ రాజారావు చాలా ప్రమాదకరమయిన వ్యక్తిలా ఉన్నాడు." రామ్మూర్తి విచారంగా అన్నాడు.

"నిజంగానే అతడు చాలా ప్రమాదకరమైన వాడు. కాకపోతే నన్ను ఈ హత్య కేసులో ఇరికించటానికి చూస్తాడా? ఇప్పుడతడు త్వరపడి, ఇంకా కొన్ని పొరబాట్లు చేస్తాడు! అవే మనకు అయుపట్టు!"

"అతడేమన్నా చెయ్యనీ? మనం మాత్రం ఈ క్షణం నుంచీ చాలా జాగ్రత్తగా ఉండకపోతే లాభం లేదు!"

"రాజారావుని ఒక కంట కనిపెట్టి ఉండు! అతడి నీకలా అతడ్ని వెన్నాడు! బహుశా నా ఊహ, రేపో మాపో కాటన్ మిల్ దగ్గరకు వెళ్ళొచ్చు!"

"అంటే నన్నిక్కడే ఉండి, రాజారావుని వాచ్ చెయ్యమంటావా?"

"అదేగదా దానర్థం! ఎందుకంటే, రాజారావు నన్నయితే చూశాడుగానీ, నిన్నెప్పుడూ చూడలేదు. కనుక నీవెవరో అతడికి తెలీదు. కనుక నీవే ఈ పనికి పూనుకోవాలి!"

రామ్మూర్తి అక్కడే మిగిలి పోయాడు.

5

మర్నాడుదయానికి రాజారావు కాటన్ మిల్ కి ప్రయాణమైనట్టు వర్తమానం అందించాడు రామ్మూర్తి.

మరో కారు వేసుకుని, సారథీ, రామ్మూర్తి అతడ్ని అనుసరించారు.

మద్రాసు నగరం దాటాక, పది మైళ్ళ అవతల, ట్రంక్ రోడ్డుమీదే ఉంది రాజా కాటన్ మిల్. దానికి కొద్ది దూరంలో రాజారావు విశ్రాంతి భవనం ఉన్నది.

రాజారావు కారు నేరుగా కాటన్ మిల్ లోకి వెళ్ళింది. అరగంట గడిచాక మళ్ళీ కారు బయలుదేరి, గెస్ట్ హౌస్ చేరుకుంది.

గెస్ట్ హౌస్ చుట్టూ నాలుగయిదు ఎకరాల విస్తీర్ణం ఉంది. చెట్లూ చేమలూ పిచ్చిగా మొలిచినయ్. ఆవరణ చుట్టూ కంచె వేసి ఉంది.

రాజారావుని గెస్ట్ హౌస్ లో దిగ విడిచి, కారు తిరిగి టౌన్ వేపుగా వెళ్ళిపోయింది.

తమ కారుని దూరంగా ఆపు చేశాడు సారథి. రామ్మూర్తిని అక్కడే ఉండమని చెప్పి తనొక్కడే కాలినడకన బయలుదేరాడు చుట్టూ తిరిగి వచ్చి బంగళా వెనుక నుంచి ఆవరణలోకి ప్రవేశించాడు. గెస్ట్ హౌస్ దగ్గరకు చేరుకున్నాడు సారథి.

పిల్లిలాగ, కిటికీల క్రిందుగ నడుచుకుంటూ, ఒక్కొక్క కిటికీ కర్టెన్ తొలగించి లోపలకు చూస్తున్నాడు. అలా ఒక ప్రక్క ముగించుకుని మరో వైపుకు వచ్చే సరికి, ఆ వైపున ఎవరివో మాటలు వినపడుతున్నయ్.

కిటికీ దగ్గరకు చేరి, కర్టెన్ని వ్రేలితో తొలగించి లోపలకు తొంగి చూశాడు సారథి.

లోపల రాజారావు సోఫాలో కూర్చుని ఉన్నాడు. అతడి కెదురుగా గుండ్రని టేబుల్ మీద టెలివిజన్

సెట్టు ఉంది. దానికి ప్రక్కగా కుర్చీలో మరో వ్యక్తి కూర్చుని టెలివిజన్ గురించి వివరిస్తున్నాడు.

"దీన్ని అంతర్జాతీయ ఉత్పత్తులస్థాయిలో తయారు చేశాను. ప్రస్తుతం మన దేశంలో టెలివిజన్‌లు కొత్తగా తయారుచేయబడుతున్నయ్. కొన్నాళ్ళలో రేడియోలకు బదులు అన్ని ఇళ్ళల్లోనూ టెలివిజన్‌లు వస్తాయనేది మీకు తెలుసనుకుంటాను!" ఆ వ్యక్తి ఆగాడు.

"అవునవును! అందుకు సందేహం లేదు! టెలివిజన్ ప్రసారాల్ని నెలకొల్పక ముందే, దేశంలో టెలివిజన్ల ఉత్పత్తికి పోటీ పడుతున్నారు ఉత్పత్తిదారులు!" రాజారావు తలూపాడు.

"అంతేకదా మరి! మార్కెట్‌లో ముందు ఏ బ్రాండ్ పేరు పడితే, వారికే కదా అధిక లాభాలు! కానీ మన దేశంలో ప్రస్తుతం తయారయే టెలివిజన్లన్నీ నలుపూ, తెలుపువే! అందుకే నేను గత రెండు సంవత్సరాలుగా శ్రమించి కలర్ టెలివిజన్ని కనిపెట్టాను. దీని తయారీకి అదనంగా ఖర్చేమీ లేదు!"

"మీ కృషి మెచ్చుకో దగిందే ఛటర్జీగారూ! ఏదీ ఒకసారి టెలివిజన్‌ని ప్రదర్శించి చూపుతారా?"

ఛటర్జీ టెలివిజన్‌ని ఆన్ చేశాడు. ఒక యువతి బొమ్మ, కనబడుతోంది అందులో. ఆమె దుస్తుల వివిధ రంగులూ శరీరచ్ఛాయ వాస్తవంకన్న రమణీయంగా కనబడుతోంది.

"భేష్! భేష్! మీ అఖండ ప్రజ్ఞకు నా జోహార్లు మిస్టర్ ఛటర్జీ! గత రెండేళ్ళుగా దీన్ని కనిపెట్టేందుకే మీకు బోలెడంత డబ్బు పెట్టుబడి పెట్టానా. మన కృషి వృధా గాలేదు! అన్నట్టు దీని ఫార్ములా గానీ, లేదా

దీన్ని తయారు చేస్తున్న విషయంగానీ వేరెవరికీ తెలియదు గదూ?'' రాజారావు అనుమానంగా చూశాడు.

''నాకూ మీకూ తప్ప మూడో కంటి వాడికెవరికీ తెలియదు! ఆఖరుకు నా కుమారైకు గూడా తెలీదు!''

''నీవా సైంటిస్టువి! నేనా వ్యాపారస్తుడ్ని. మన మిద్దరం కలిసి ఈ సరికొత్త వ్యాపారాన్ని మొదలెట్టబోతున్నాం. ఇరాన్, ఇరాక్, ఆఫ్రికా దేశాలకు గూడ ఈ కొత్త సెట్స్‌ని ఎగుమతి చేయొచ్చు. కొద్దిలోనే మనం కోటీశ్వరులం అయిపోతాం!''

సారథి తను చూడదల్చుకున్నది చూశాడనీ, ఇక ఆట్టే సేపు అక్కడ మసలటం మంచిది కాదనుకున్నాడు. టెలివిజన్ రహస్యాన్ని పూర్తిగా తెలుసుకుందామని కుతూహలం ఉన్నా ఆ కోరిక చంపుకుని అక్కడ్నుంచి బయటపడ్డాడు.

ఆ టెలివిజన్‌ని తయారు చేసిన సైంటిస్ట్ యూనివర్సిటీలో ఫిజిక్స్ ప్రొఫెసర్. అతడ్ని లోగడ ఒకటి రెండు సార్లు తాను చూడటం తటస్థించింది. అతడి నివాసం గూడా రామ్మూర్తి చూశాడు.

''పాపం! ఆ సైంటిస్ట్ ఒట్టి వెర్రిబాగుల వాడిలా ఉన్నాడు. కాకపోతే, గడ్డిగా రాజారావుని, ఈ మేక వన్నె పులిని, నమ్మి అతడి చేతిలో పెడతాడా తన కృషి ఫలితాన్ని? ముందా టెలివిజన్ ఫార్ములాని రిజిస్టర్ చేయించాక, రాజారావుకి తెలియజేయాల్సింది. అతడ్ని ఉపయోగించుకుని రాజారావు కోట్లకు పడగెత్తుతాడు'' అన్నాడు సారథి.

''ఎందుకయినా మంచిది! రేపుదయం ఛటర్జీ ఇంటికి వెళ్ళి, రాజారావు నిజ స్వరూపాన్ని తెలుపుదాం! తగు

జాగర్తలో ఉండకపోతే, రాజారావు ఎంతటి దారుణానికైనా వెనుదీయడని హెచ్చరిద్దాం!" రామ్మూర్తి సూచన చేశాడు.

"కానీ ఛటర్జీ మన మాటల్ని లక్ష్యపెట్టక పోవచ్చు. పైగా తనేమీ టెలివిజన్నే తయారు చేయలేదని మన దగ్గర బుకాయించవచ్చు!"

"అలా అయితే వాడి ఖర్మను వాడే అనుభవించి తీరతాడు!"

6

స్నాన పానాదులు ముగించుకుని సారధి, రామ్మూర్తి ఇద్దరూ ఛటర్జీ ఇంటికి బయలుదేరారు.

పెద్ద ఆవరణలో ఒకదానికొకటి పొంతన లేకుండా, మూడు వాటాలున్నాయ్. ఒక వాటా తలుపు మీద యస్. ఛటర్జీ, ఎం. ఎస్. సి. పి. ఎచ్. డి. అని బోర్డు కనబడుతోంది.

రామ్మూర్తి కాలింగ్ బెల్ నొక్కాడు.

ధడాల్ని తలుపు తెరుచుకుంది. ఎర్రగా, ఉబ్బిన కళ్ళతో అందమైన ఇరవయ్ సంవత్సరాల యువతి తలుపు తెరిచింది.

ఆగంతకు లిద్దరివంక భయంగానూ, ఆత్రంగానూ చూసింది. "మీరు ...మీరు మా నాన్నగారి గురించేనా వస్తుంట?"

"చూడమ్మాయ్! నీవు ఎందుకంత గాబరా పడుతున్నావో నాకర్థం కావటం లేదు! బహుశా ఛటర్జీగారి కుమార్తె మీరేనా?"

"అవునండీ! నా పేరు సవిత!"

"అన్నట్టు నాన్నగారు ఇంట్లో లేరా?"

"లేరండీ! ఆయన గురించే నేను ఆందోళన పడుతుంట! నిన్న ఉదయం అనంగా ఆయన ఇల్లు వదిలి వెళ్ళారు. రాత్రికి కూడ తిరిగి రాలేదు! వారి గురించిన సమాచారం చెప్పటానికి వచ్చారేమో మీరు అని ఆశపడ్డాను!"

సారధీ, రామ్మూర్తి ఒకళ్ళ ముఖం మరొకరు చూసుకున్నారు.

"సారీ! మిమ్మల్ని వాకిట్లోనే నిలబెట్టి మాట్లాడుతున్నాను. లోపలకు వచ్చి కూర్చోండి!" అంటూ సవిత అడ్డం తొలగింది.

కుర్చీలో కూర్చుంటూ సారథి అడిగాడు, "ఇప్పుడు చెప్పమ్మా మీనాన్నగారి గురించి?"

రామ్మూర్తి సవిత వంకే గుడ్లప్పగించి చూస్తున్నాడు ఆమెను తినేసేలా!

"మా నాన్నగారు పగలల్లా ఎక్కడ సంచరించినా రాత్రికి తప్పకుండా ఇల్లు చేరుకుంటారు! అటువంటిది రాత్రి ఆయన ఇంటికి రాలేదు. ఆయన ఏమయ్యారో అని భయపడి ఛస్తున్నాను.

"వారు బయటకు వెళ్ళేటప్పుడు ఎక్కడకు వెళ్ళేదీ చెప్పే అలవాటు లేదు. మా ఇంటి వెనుక రూమ్‌లో ఆయన చాలారోజుల్నుంచి దేన్ని గురించో ప్రయోగాలు చేస్తున్నారు. నన్ను ఏనాడూ ఆ రూమ్‌లోకి తొంగి కూడ చూడనిచ్చేవారు కాదు. నిన్న ఆయన ఎవరో ప్రముఖ వ్యక్తిని, అంటే మానాన్న చేసే ప్రయోగాలకు ధన సహాయం చేస్తూన్న వ్యక్తిని, కలుసుకోవటానికి వెళ్ళి ఉంటారని ఊహించాను. రాత్రి వారు ఇంటికి రాకపోవ

టంతో, వారు దోవలో ఏదైనా ప్రమాదానికి గురైయ్యా రేమో అని భయంగా ఉంది!''

''మీ నాన్నగారి ప్రయోగాల గురించి మీకేం తెలీదంటారు?''

''రూఢిగా తెలీదు. కానీ ఇదివరలో రేడియోలగురించి అనేక ప్రయోగాలు చేశారని మాత్రం తెలుసు! ఈ మధ్యనే ఆయన నాతో సంతోషంగా చెప్పసాగారు 'బేబీ! మనం త్వరలో లక్షాధికారులం అయిపోతాం' అని, అన్నట్టు మానాన్నగారితో మీకేం పని!''

''మేం ప్రైవేట్ డిటెక్టివ్‌లం! నా పేరు సారధి. ఇతగాడి పేరు రామ్మూర్తి. టెలివిజన్ తయారీ గురించే! వారితో మాట్లాడదామని వచ్చాం!

''మీ నాన్నగార్ని కలుసుకునేందుకు మేం మళ్ళీ వస్తాం! ఈలోపల వారిగురించి ఏదైనా సమాచారం తెలిస్తే మాకు తెలియజేయటం మరవ్వద్దు!'' అంటూ తమ అడ్రసు వున్న విజిటింగ్ కార్డుని ఆమె చేతికిచ్చాడు సారధి.

7

ఆఫీసులో కూర్చుని కేసు వివరాల్ని సార్ట్ చేసుకుంటూండంగా, సబిత రానే వచ్చింది.

''ఓ! మీరా? రండి! రండి! మీనాన్నగారి ఆచూకీ ఏమైనా తెలిసిందాండీ?'' రామ్మూర్తి ఆమెను ఆహ్వానించాడు.

''వారి జాడ తెలియదండి! కాని వారి కారు సిటీలో ఒక సినిమాహాలు దగ్గర దొరికిందని పోలీసులు ఫోను చేశారు. మనం తక్షణం అక్కడికోసారి వెళ్ళటం మంచి దని నా ఉద్దేశ్యం! అందుకు మీసాయం కోరటానికి వచ్చాను!'' అన్నది సబిత వగరుస్తూ.

"మాడమ్మాయ్! కారుని వదిలేసిన వ్యక్తులెవరో, నిన్నూ మమ్మల్నీ తప్పుదారి పట్టించేందుకు వేసిన పన్నాగం ఇది! మీ నాన్న సిటీలో మాత్రం లేరని ఖండితంగా చెప్పగలను!" సారధి ఆమె వంక నిస్సహాయంగా చూస్తూ అన్నాడు.

"మీ మాటలు నాకు భయాన్ని కల్గిస్తున్నయ్!" సబిత బెరుకుగా అంది.

"మేం సేకరించిన సమాచారం మీకు విచారం కల్గించక తప్పదు. మీ నాన్న ఈ మధ్యనే కలర్ టెలివిజన్‌ని తయారుచేసే ఫార్ములాని కనిపెట్టాడు. ఆయన ప్రయోగాలకు ధనసహాయం చేస్తున్న వ్యక్తి రాజారావు. అతడిని కలుసుకోవటానికి వెళ్ళాడు మీ నాన్న.అతడితో వ్యాపార సరళిలో మాట్లాడుతూ బిజీగా ఉండవచ్చు. లేదా అతడి చేతిలో మీ నాన్న బందీ అయి ఉండాలి" సారధి నిదానంగా చెప్పాడు.

సబిత ఆశ్చర్యంతో, భయంతో నోరు తెరుచుకుని వింటూ ఉండిపోయింది.

"ఇదేదో రేడియోలో సీరియల్ నాటికలా ఉంది! మీరు నాతో పరాచికాలాడటం లేదుకదా?" అంది చివరకు.

"కాకపోతే మరేమిటి? కారు చెక్కు చెదరకుండా, రోడ్డు మీద దొరకటం చూస్తే మీ మటుకు మీకేమని పిస్తున్నది? కారుని రోడ్డుమీద వదిలేసే అవకాశమే గనుక ఉంటే, నీకు ఫోన్ చెయ్యటమో, టెలిగ్రామ్ ఇవ్వటమో చేసి ఉండే వారే గదా?"

"అవునవును! అదీ నిజమే సారధిగారూ! మీరెలాగైనా నాన్నగార్ని విడిపించి, రక్షించాలి! ఇదంతా

చూస్తుంటే, ఆ రాజారావు నాన్నని హత్య చేయటానికైనా వెనకాడడల్లే కనిపిస్తున్నది.''

''నీవు అంతగా అధైర్య పడనవసరంలేదు బేబీ! బంగారు గుడ్లుపెట్టే బాతుని ఎవరూ చూస్తూ చూస్తూ చంపరు!''

''పోనీ ఈ విషయాన్ని పోలీసులకు తెలియజేస్తేనో?''

''లాభం లేదు! తగిన సాక్ష్యాలు లేందే పోలీసులు మన మాటలు విశ్వసించరు. పైగా రాజారావు పోలీసులకు ఆచూకి చిక్కకుండా మీ నాన్నను మాయం చేయగలడు! కనుక వాడ్ని నేనే దొరకబుచ్చుకుంటాను! ఈ లోపల మీ ఇంటిని ఒకసారి సోదా చేయాలి!''

''ఎందుకు? మా ఇంట్లో ఏముంది?''

''మీనాన్న ప్రయోగం గురించిన ఫార్ములా, లేబరటరీలో తప్పకుండా దొరుకుతయ్యాని నా నమ్మకం! అందులో మీ ఇల్లు అడవిలో ఉన్నట్లుగా ఉంది. మిగత వాటాల్లో ఉండే భార్య భర్తలు అందరూ పగటి పూట ఉద్యోగాలకు వెడతారు. కనుక మీరు లేనప్పుడు ఎవరైనా రాజారావు మనుష్యులు ఇంటి వెనుకనుంచి కిటికీ పగుల గొట్టి లోపలకు జొరబడే అవకాశం ఉంది. ఒకసారి మీనాన్నగారి లేబరటరీని చూసి వద్దామా?''

సబిత వెంటే, ఆమె ఇంటికి వెళ్ళారు సారధి, రామ్మూర్తి. ఆ ఇల్లు చాలా పాతబడింది. ఛటర్జీ లేబరటరీ మూలల్ని సాలెగూళ్ళు అల్లుకుని ఉన్నాయ్.

ఒక మూలగా టేబుల్ మీద కాగితాలకట్ట ఉంది. పెన్సిల్‌తో, కలంతో, ఆ కాగితాలనిండా ఏవో లెక్కలూ, ఈక్వేషన్లూ ఉన్నాయ్. టెలివిజన్ తయారీకి పనికి వచ్చే పరికరాలు మరికొన్ని ఉన్నాయ్.

డ్రాయరూ, అలమారూ అన్నీ వెదికినా ఫార్ములా లాంటి వేవీ కనుపించలేదు.

“అన్నట్టు నీవు ఏదో ఆఫీసులో టైపిస్ట్ గా పని చేస్తున్నా వనుకుంటాను! మీరు ఆఫీసుకు పోలేదా?”

“లేదండీ! రెండు రోజులు సెలవు పెట్టాను. నా మన సెందుకో, ఏ క్షణాన అయినా డాడీ తిరిగి రావచ్చని చెబుతున్నది. ఆయన సంగతి తెలిసేదాకా, నేను ఆఫీసుకు వెళ్ళను!”

“పగటి పూట ఈ ప్రదేశం అంతా నిర్మానుష్యంగా ఉంటుంది గదా? నీకు ఒంటరిగా ఉండటానికి భయం వేయదూ? అటు ఆఫీసుకన్నా వెళ్ళు, లేదూ తోడుగా ఎవరినన్నా తెచ్చుకో! నీవు ఒంటరిగా ఉండటం మంచిది కాదనుకుంటాను!” అన్నాడు రామ్మూర్తి, ఆ ఇంటి పరిసరాలు చూస్తూ.

అసలు కేసు వదిలేసి, కేవలం సబిత క్షేమాన్ని గురించే రామ్మూర్తి ఆదుర్దా పడటం చూసి సారథి నవ్వుకున్నాడు లోలోపలే.

“లేను! ఈ ఇల్లు వదలి నేనెక్కడికీ రాను! నేనే మంత పిరికిదాన్ని కాదు! ఒకర్తెనే ఉండగలను! ఏక్షణాన అయినా మా నాన్న కానీ, ఆయన గురించి సమాచారం గానీ రావచ్చని నా మనసు చెబుతోంది!”

“సరే నీ ఇష్టం; ఏదన్నా విషమపరిస్థితులు వస్తే, మాకు ఫోన్ చేయటం మరచిపోకు సబితా!” అక్కడ్నుంచి వెళ్ళిపోతూ సారథి హెచ్చరించాడు.

8

సబిత ఆలోచిస్తూ కూర్చుంది. రామూర్తి హెచ్చరించి నట్టుగా తనను ఏదైనా ప్రమాదం వెన్నంటుకుని ఉందా అని తీవ్రంగా ఆలోచించింది.

ఆమె ఆలోచనలకు అంతరాయం కలిగిస్తూ, టెలిగ్రామ్ మెస్సెంజర్ వచ్చాడు.

"సబిత గారంటే మీరేనా? మీకు టెలిగ్రామ్ ఉన్నదండి!" అంటూ టెలిగ్రామ్ అందించి, సంతకం పెట్టించుకుని వెళ్ళిపోయాడు.

"అర్జెంటు వ్యవహారం మీద ఉండిపోయాను. మూడున్నర గంటలకు గిండీ స్టేషన్లో నీకోసం ఎదురు చూస్తుంటాను. వెంటనే రా!"

టెలిగ్రామ్ సారాంశం అది.

టైమ్ చూసుకుంది సబిత. రెండున్నర గంటలయింది.

పిచ్చిదానిలా నవ్వింది ఆమె! తండ్రి జాడ తెలిసింది! అతడు క్షేమంగా ఉన్నాడన్నమాట! ఈ డిటెక్టివ్లు చిన్నవిషయానికి గూడ రాద్ధాంతం చేస్తారు! అని మరో సారి నవ్వుకుంది.

తనకిలా టెలిగ్రామ్ వచ్చిందని సారధి ఆఫీసుకు ఫోన్ చేసేనో? ఎందుకనవసరం శ్రమ! తండ్రి తనను రమ్మని టెలిగ్రామ్ ఇచ్చాడు. కనుక తను నిర్భయంగా పోగలదు. అనుకుని మళ్ళీ ఆ పని విరమించుకుంది.

టాయిలెట్ అయి, ఇల్లు తాళం పెట్టి, ఎలక్ట్రిక్ ట్రెయిన్ ఎక్కేందుకు స్టేషను చేరుకుంది. బుకింగ్లో టికెట్ కొనుక్కొని ప్లాట్ఫారం మీదకు వెళ్ళంగానే ట్రెయిన్ వచ్చింది.

గిండీ స్టేషన్లో సబిత ట్రెయిలు దిగింది. ప్లాట్ఫారమ్ మీద తండ్రి కనుపిస్తాడేమో అని ఒళ్ళంతా కళ్ళు చేసుకుని చూసింది. కాని ఎక్కడా ఆమె తండ్రి జాడలేదు.

బహుశా స్టేషన్ బయట వేచి ఉన్నాడేమో అనుకుని బయటకు నడిచింది.

రోడ్డు మీదుగా జాక్సన్ నల్లని కారుకు ఆనుకుని నిలబడ్డాడు. అతని అరచేతిలో చిన్న ఫోటో ఉంది. మాటి మాటికీ ఫోటోలోకి చూస్తూ, ట్రెయిన్ దిగి వస్తున్న యువతుల వంక పరీక్షగా చూస్తున్నాడు.

సవిత స్టేషను బయటకు వచ్చింది. ఆమెను చూడంగానే జాక్సన్ ముఖం వికసించింది.

ఆమె చేరువ కాంగానే, "మాడమ్! మీ పేరే సవిత అనుకుంటాను! నన్ను మీ నాన్నగారు పంపారు. ఈ కారులో ఎక్కండి!" అన్నాడు.

సవిత అతడ్ని తేరిపార చూచింది అనుమానంగా.

"కావాలంటే మీ ఫోటో గూడ నాచేతి కిచ్చారు మీ నాన్నగారు! మిమ్మల్ని ఆనవాలు పోల్చుకు నేందుకని!" అంటూ తన చేతిలోని ఫోటో చూపించాడు ఆమెకు జాక్సన్ ఆమె అనుమానాన్ని గ్రహించి.

సవిత ఫోటోవంక పరీక్షగా చూసింది. అది తనదే! తన తండ్రి పర్సులో ఆఫోటో ఎల్లప్పుడూ ఉంటుంది. దాన్నే ఇచ్చి పంపినట్టున్నాడు అనుకుంది.

డోర్ తెరిచి వెనుక సీట్లో కూర్చుంది సవిత.

సీటిలిమిట్స్ దాటే దాకా కారు మామూలు వేగంతో ప్రయాణించింది. ఆ తర్వాత స్పీడందుకుంది.

తనను గిండీ స్టేషన్‌లో కలుసుకుంటానని టెలిగ్రామ్ ఇచ్చిన తండ్రి, ఎందుకు రాలేదు తనను రిసీవ్ చేసుకోను? పైగా కారు అతివేగంగా సిటీ లిమిట్స్ దాటిపోతోంది, ఇందులో ఏదైనా మోసం ఉందా?

మొట్టమొదటిసారిగా, ఆమెకు రామ్మూర్తి హెచ్చరిక గుర్తుకు వచ్చింది. తను పొరబాటు చేయడం లేదుగదా అని బాధపడింది మనసులో.

కారు హైరోడ్డు మీద నుంచి మళ్ళింది. కొద్ది దూరం వెళ్ళి ఆగింది. సబిత అనుమానంగా అటూ ఇటూ చూసింది. చుట్టూ మైదానం తప్ప, కనుచూపు మేరలో ఇల్లనేది లేదు. కారాగిన చోట మాత్రం పాడుబడ్డ భవనం ఉంది. ఆవరణలో చెట్లూ చేమలూ చిందర వందరగా, ఇష్టం వచ్చినట్లు పెరిగి ఉన్నయ్.

"డ్రైవర్! ఇదేమిటి? ఈ నిర్మానుష్య ప్రదేశంలోకి తెచ్చావ్ నన్ను?" సబిత అడిగింది.

"నాన్నగారు ఇక్కడకే వస్తారమ్మా! మీకొచ్చిన భయం ఏమీ లేదు. రెండు నిముషాలు కూర్చోండి!" అన్నాడు, తెల్లని యూనిఫారంలో ఉన్న డ్రైవరు.

"రాజారావుగారి భవంతా ఇది?" సబిత చుట్టూ చూస్తూ అంది.

డ్రైవరు ఆశ్చర్యపోయాడు. సబితకు తన గురించి ఏమీ తెలియదని రాజారావు చెప్పాడు. ఆ యువతి తెలుసుకో వలసిన దానికన్నా ఎక్కువే నేర్చుకున్నట్టుంది. అటు వంటప్పుడు, తమ మోసాన్ని గ్రహించి ఆమె అల్లరి పెడుతుందనుకున్నాడు.

"ఇక్కడెందుకు ఆపావో చెప్పక పోతే, కారుదిగి వెళ్ళిపోతాను నేను!"

"మీరలా రచ్చ చేసుకుంటే నష్టపోయేది మీరే! కొద్ది క్షణాల్లోనే మీ నాన్నగారెదుట ఉంటారు మీరు!" ఆమెకు నచ్చ చెబుతున్నట్టుగా చెప్పాడు డ్రైవర్.

"అదేం కుదరదు! తక్షణం మా నాన్నను చూపిస్తావా లేక నన్ను వెళ్ళి పొమ్మంటావా?" అంది కారుడోర్ తెరుస్తూ.

"చూడండి మిస్! మీరలా మొండికేస్తే నేను బల ప్రయోగం చేయాల్సి వస్తుంది! ఆ తర్వాత నన్నని ప్రయోజనం లేదు."

సబిత కారు దిగి వెళ్ళిపోవటానికి ప్రయత్నించింది. కానీ ఆమెకన్న వేగంగా డ్రైవర్ కదిలాడు. పెద్ద దుప్పటి తీసుకుని సబిత మీద కప్పేశాడు.

గిజగిజలాడుతున్న సబితను దుప్పటిలో చుట్టేసి, తాడుతో కట్టేశాడు. అతడి రాక్షస హస్తాల్లో కోమల మైన సబిత ఎంత తంటాలు పడ్డా, విడిపించుకోలేక పోయింది.

మూటనెత్తి కారులో వెనుక సీట్ మీద పడేశాడు డ్రైవర్. తన బాస్ కోసం ఆత్రంగా ఎదురు చూడ సాగాడు జాక్సన్.

9

"రామ్మూర్తీ! టెలిఫోన్ని కనిపెట్టుకుని ఉండు! నేనలా ఒకచిన్న కునుకు తీస్తాను!" అన్నాడు సారధి.

"అలాగే బాస్!" అన్నాడు రామ్మూర్తి, కాళ్ళు టేబుల్ మీదకు జాపుతూ.

సారధి ప్రక్కనే ఉన్న బెడ్ రూమ్లోకి వెళ్ళి తలుపు దగ్గరకు వేశాడు.

రామ్మూర్తి సిగరెట్ వెలిగించాడు. అతడి మనసులో సబిత మెదిలింది. పాపం! ఆ అమ్మాయిని ఆపదలు చుట్టు కుంటాయేమో అని బాధపడ్డాడు. సబిత తండ్రి తిరిగి

వచ్చేలోగా, ఆమెను కాపాడుకో గలిగితే ఎంత బాగుండును!

సారథి నిద్రలోకి జారుకున్నాడు. తనోసారి సబిత ఇంటికి వెళ్ళి ఆమెను చూసి వస్తేనో! సారథి లేచేలోపలే తను తిరిగి వచ్చేయచ్చు!

లేడికి లేచిందే పరుగన్నట్టు రామ్మూర్తి కుర్చీలోంచి లేచాడు. వాకిట్లో కునికి పాట్లు పడుతున్న బోయ్‌ని మొట్టికాయ వేసి లేపాడు. తను సబిత ఇంటికి వెళ్తున్నట్టుగా చెప్పాడు. తను తిరిగి వచ్చేలోపుగా సారథి లేచి అడిగితే చెప్పమన్నాడు.

ఆటోరిక్షాలో సబిత నివాసం చేరుకున్నాడు రామ్మూర్తి. ఆమె తనను లోపలకు ఆహ్వానిస్తుందనీ, తన చేతిమీదుగా టీ అందిస్తుందనీ ఊహించుకుంటూ కాలింగ్ బెల్ నొక్కాడు.

రెండుసార్లు నొక్కినా, లోపల గంట మ్రోగటం వినిపించిందే కానీ తలుపు తెరుచుకోలేదు.

అప్పుడు గానీ అతడు తన ఊహా ప్రపంచంలోంచి వాస్తవిక జగత్తుకి రాలేదు. వాకిలి తలుపుకి తాళం వేసి ఉంది.

అరె! సబిత బయటకు వెళ్ళిందన్నమాట? తమ ఆఫీసుకు రాలేదు! మరి ఎక్కడకు వెళ్ళినట్టు? ఒక వేళ పోలీస్‌కి రిపోర్టు ఇవ్వటానికేమైనా వెళ్ళిందా?

అతడికో ఆలోచన వచ్చింది. తన జేబులోంచి తాళం చెవుల గుత్తి తీసి, ఆ తాళం తీయడానికి ప్రయత్నించాడు.

'క్లిక్' 'క్లిక్' అని తాళంచెవి సగంలోనే తిరగటం మానేసింది. మరో జేబులోంచి వ్రేలెడు గుండ్రని అఖ

రాతిని తీసి తాళం చెవిని కొద్దిగా అరగతీశాడు. తిరిగి తాళం తీయటానికి యత్నించాడు.

తాళం ఊడి వచ్చింది. తలుపు తీసుకుని లోపలకు జొరపడ్డాడు రామ్మూర్తి.

నేలమీద టెలిగ్రాం కనుపించింది అతడికి. దాన్ని చదువుతూనే, రామ్మూర్తి నీరయిపోయాడు.

నిజంగా ఆ టెలిగ్రామ్ సబిత తండ్రి ఇచ్చినదేనా? లేక ఛటర్జీని వంచటానికి రాజారావు సబితను అపహరించటానికి వేసిన ఎత్తా?

లోపల లేబరటరీ కిటికీలు తెరచి ఉండటాన్ని గమనించాడు రామ్మూర్తి. బహుశా ఛటర్జీయే ఇంటికి తిరిగి వచ్చి ఉండవచ్చు. ఆయన రాకతో తృప్తిపడి, సబిత తన ఆఫీసుకు వెళ్ళిందేమో!

"ఎవరు లోపల? ఛటర్జీగారా?" అని అరిచాడు రామ్మూర్తి.

అప్పటిదాకా లేబరటరీ లోంచి, ఎలుకలు కాగితాల్ని కొట్టివేస్తున్న చప్పుడు వస్తున్నది. అది కాస్తా, రామ్మూర్తి అరుపుతో ఆగిపోయింది.

ఆశ్చర్యంతో రామ్మూర్తి లేబరటరీలోకి వెళ్ళాడు. "ఛటర్జీ!" అని మరోసారి పిలిచాడు.

బదులు రాలేదు. గదిలో డ్రాయర్లూ, అలమారుల్లోని కాగితాలన్నీ చిందర వందరగా ఉన్నయ్. ఇంత క్రితమే ఎవరో వాటిని కలయ బెట్టినట్టుగా తోచింది.

అయోమయంగా వాటివంకే చూస్తున్న రామ్మూర్తిని వెనుకనుంచి ఎవరో తలమీద గట్టిగా కొట్టారు.

ఆ దెబ్బకు రామ్మూర్తి పడిపోయాడు. అతడి మీద

దుప్పటి విసిరి వేయబడింది. ఆతడ్ని దుప్పటిలో చుట్టి, త్రాటితో బంధించాడు ఆగంతకుడు.

మరో పదినిముషాలు గదిలో కాగితాలన్నీ శోధించి ఆగంతకుడు వెళ్ళి పోయాడు.

గదిలోని వ్యక్తి అడుగుల చప్పుడు దూరమవటం గ్రహించంగానే, దుప్పటిలో రామ్మూర్తి 'ఊఁ!' అని మూలగటం ప్రారంభించాడు.

10

టేబుల్ మీది టెలిఫోన్ "రంయ్" "రంయ్" మని మ్రోగుతోంది. సారధికి నిద్రాభంగమైంది.

చిరాకుగా "రామ్మూర్తి! ఆ ఫోన్ అలా మ్రోగు తుంటే, ఏం చేస్తున్నావ్! నీవూ నిద్రపోతున్నావా!" అని అరిచాడు.

ఆఫీసు రూమ్‌లోంచి బదులు రాలేదు. బెడ్ మీద నుంచి లేచి ఫోన్ కాల్ అందుకున్నాడు.

రిసీవర్ని క్రేడిల్ మీద పెట్టేస్తూ, వరండాలోకి వెళ్ళాడు సారధి. ఆఫీసుబోయ్ చివర మెట్టు మీద కూర్చుని రోడ్డు మీద ఎవరితోనో మాట్లాడుతున్నాడు; సిగరెట్ త్రాగుతూ.

సారధిని చూస్తూనే వాడు సిగరెట్‌ని అవతలపారే శాడు. గబగబ మెట్లెక్కి పైకి వచ్చాడు.

"చిన్నసార్ సబిత ఇంటికి వెళ్తున్నానని చెప్పారు సార్!" అన్నాడు బోయ్.

"ఎంత సేపయిందేమిటి వెళ్ళి?"

"చాలా సేపయియింది సార్!"

రామ్మూర్తి సబితతో ప్రేమాయణం ముచ్చటిస్తూ టైమ్ గూడ మరిచాడేమో అనుకున్నాడు.

లోపలకు వెళ్ళి ముఖం కడుక్కుని, డ్రెస్ చేసుకున్నాడు సారథి. నేరుగా సవిత ఇంటికి కారులో బయలుదేరాడు.

సవిత ఇంటి తలుపు దగ్గరగా మూసి ఉంది. తలుపు నెట్టి, తను వచ్చిన అలికిడి విని ఎవరైనా బయటకు వస్తారేమో అని ఒక్క క్షణం ఎదురు చూశాడు.

చెట్లమీద పక్షుల అరుపులు మినహా, ఎటువంటి శబ్దమూ వినరాలేదు.

ఇంట్లోంచి లేబరటరీ రూమ్‌లో కెళ్ళాడు సారథి. లేబరటరీలో లైట్లు వెలుగుతున్నయ్. నేలమీదా, టేబుల్ మీదా, అంతటా కాగితాలు చిందరవందరగా పడి ఉన్నయ్.

అంతలో అతడికి ఎవరో మూలుగుతున్న చప్పుడు వినిపించింది.

"“ఎవరది?” సారథి శబ్దం వస్తున్న వేపుగా చూస్తూ అరిచాడు.

దుప్పటిలో చుట్టబడి, ఒక వ్యక్తి మూలుగుతూ, గిజగిజలాడుతున్నాడు.

సారథి అతడ్ని బంధవిముక్తుడ్ని చేసాడు. ఆ దుప్పటిలో బంధింపబడింది రామ్మూర్తి అని గ్రహించి, విస్తుపోయాడు సారథి.

"దెబ్బలేం తగల్లేదు కదా? ఎవరీ పని చేసింది? సవిత ఎక్కడ?"

"తలమీద ఎవరో కొట్టారు నన్ను. నాకు మైకం వచ్చింది. నన్ను ఈ దుప్పటిలో చుట్టి పడేశాడనుకుంటాను ఆ ఆగంతకుడు! ఇక సవిత విషయమా? ఇదిగో! ఇది

చూస్తే మీకే తెలుస్తుంది!'' అంటూ రామ్మూర్తి తన జేబులోంచి టెలిగ్రామ్‌ని తీసి సారథి చేతిలో పెట్టాడు.

''నేను అనుకుంటూనే ఉన్నాను. మనం రాజారావుని అనుమానిస్తున్నామని పసిగట్టంగానే, రాజారావు ఛటర్జీతో వ్యవహారం కుదుర్చుకోవటానికి ఆత్రుత పడుతున్నాడు. సవితను కూడా వాడు చేజిక్కించుకున్నాడు, ఛటర్జీని లొంగ దీసుకోవడానికి.''

''ఆ కిరాతకుడు సవితను చిత్రహింస పెడతాడేమో గురూ?''

''ఎంత సేపటికీ సవిత గురించే నీ ఆలోచన. ఛటర్జీ గురించి పట్టించుకోవేం?'' మందలింపుగా అన్నాడు సారథి.

''సారీ గురూ?'' అంటూ నాలుక కొరుక్కున్నాడు రామ్మూర్తి. ''వాళ్ళిద్దర్నీ రక్షించేందుకు మనం ఏమైనా చేయాలి వెంటనే!''

''కానీ వాళ్ళు ఎక్కడున్నారని! బహుశా కాటన్ మిల్ దగ్గరున్న పాత మేడలో వాళ్ళిద్దర్నీ దాచి ఉండాలని నా అనుమానం! మనం తక్షణమే అక్కడకు వెళ్ళి వెదుకుదాం!'' అన్నాడు సారథి.

11

రాజారావు మేడదిగి వచ్చాడు. వెనుకభాగంలోకి నడిచాడు. చెట్లూ చేమల మధ్యగా మసక చీకటిలో కూడా ధైర్యంగా అడుగులు వేస్తూ కారుని సమీపించాడు.

కారు కానుకుని సిగరెట్ త్రాగుతున్న జాక్సన్, సిగరెట్ అవతల పారేసి, సెల్యూట్ చేశాడు.

''ఏదీ ఆ అమ్మాయి?'' కారులోకి చూస్తూ అడిగాడు రాజారావు.

"ఆమెకు అనుమానం వేసింది కాబోలు, ఎదురు తిరిగింది సార్! మూటకట్టి లోపల పడేశాను" జాక్సన్ బదులు చెప్పాడు.

"ఆమె ఒంటి మీద చెయ్యి వెయ్యొద్దని చెప్పానా లేదా నీకు! పంది వెధవా!"

"నేనేం చేయను సార్! కారు దిగి ఆమె పారిపోవ టానికి యత్నించింది!"

"అఘోరించక పోయావ్గా?" అంటూ దుప్పటి మూటను రెండు చేతులతో మోస్తూ, రాజారావు మేడ వేపుగా వెళ్ళాడు.

మేడమీదకు వెళ్ళకుండా, మరో ద్వారం తెరుచుకుని నేలమాళిగలోకి వెళ్ళే మెట్లుదిగుతూ, భూగృహంలోకి వెళ్ళాడు.

మూటను మెట్లమీద ఉంచి తన వెనుకనే తలుపు మూసేశాడు. మళ్ళీ మూట నెత్తుకొని మరో తలుపు నెట్టాడు.

ఆ గది అధునాతనంగా అలంకరింపబడి ఉంది. నేల మీద ఎర్రని తివాచీ, సోఫాలూ, ట్యూబ్ లైట్స్‌తో ఎయిర్‌కండిషన్ చేయబడి, మనసుకు ఆహ్లాదం కలిగించేలా ఉంది ఆ గది.

సవిత బంధనాలు ఊడదీశాడు రాజారావు. సవిత ముఖం జేవురించి ఉంది. కళ్ళు ఎర్రబడ్డయ్. జుట్టు రేగి పోయింది.

రాజారావు వంక చూస్తూ, "నువ్వు మనిషివా, రాక్షసుడివా?" అని పళ్ళు కొరికింది సవిత.

"కోపం తెచ్చుకోకు అమ్మాయ్! నా డ్రైవర్ చేసిన తప్పిదానికి నేను నిజంగా చింతిస్తున్నాను."

"ఈ నక్క వినయాలకేంలే! ఇంతకీ మా నాన్న ఎక్కడ రాజారావ్!" అంది సవిత.

రాజారావు ఉలిక్కిపడ్డాడు. తన పేరు ఈమె కెలా తెలిసిందబ్బా! ఛటర్జీ తన గురించి కుమార్తెకు గూడ తెలియదని చెప్పాడే! ఒకవేళ ఆ డ్రైవర్ వెధవ ఏమైనా చెప్పాడేమో!

"నా పేరు నీకెలా తెలుసు? డ్రైవర్ చెప్పాడా?" ఆశ్చర్యపోతూ అన్నాడు రాజారావు.

"డ్రైవర్ కాదు సారథి చెప్పాడు. నీ గురించి అంతా చెప్పాడు. ఇంతకీ మా నాన్న ఎక్కడ?"

సవితతో మాట్లాడడం తను అనుకున్నంత తేలిక కాదనుకున్నాడు రాజారావు. సారథి పేరు వింటూనే, అతడి వెన్నులో భయం జరజర ప్రాకింది.

"ఇలా జరగవచ్చని ఆయన ముందే హెచ్చరించాడు గూడా! కానీ నేనే అతి ఆతృతలో నీ దొంగ టెలి గ్రామ్ని చూసి మోసపోయాను. మా నాన్న నేం చేశావ్ చెప్పు ముందు?"

రాజారావు తన మనసులోని ఉద్వేగాన్ని కప్పిపుచ్చు కుంటూ నవ్వేశాడు.

"కాస్త నిమితపడు సవితాదేవీ! మీ నాన్నకొచ్చిన ప్రమాదమేం లేదు! ఆయన నిక్షేపంలా ఉన్నాడు. త్వర లోనే ఆయన్ని కలుసుకోవచ్చు నీవు! మీ నాన్న నే చెప్పి నట్టుగా వింటే, మీరిద్దరూ క్షేమంగా తిరిగి వెళతారు సరేనా?"

"అంటే నీ ఉద్దేశ్యం?"

"అలమారులో రొట్టె, బిస్కట్లూ, డ్రింక్స్ ఉన్నాయ్. ఈ గదికి ప్రక్కనే లావెటరీ, బాత్‌రూమ్ ఉన్నాయ్. హాయిగా విశ్రమించు! నేను వెళ్ళాలి! ఇప్పటికే చాలా లేట్ అయింది!" అంటూ రాజారావు లేడిలా తలుపు తెరుచుకుని తను గది బయటకు వచ్చి, తలుపు మూసి తాళం పెట్టాడు.

లోపల్నుంచి సబిత అరచి కేకలుపెట్టినా బయటకు వినబడటంలేదు, ఆ గది ఎయిర్‌కండిషన్డ్ చేయబడి ఉండటం మూలాన్ని.

రాజారావు మరో తలుపులో అదే తాళంచెవిని దూర్చి త్రిప్పాడు. క్లిక్‌మని తాళం విడిన చప్పుడు రాంగానే, తలుపు నెట్టుకుని లోపలకు వెళ్ళాడు. ఆ గది గూడా సబిత ఉన్న గదిలానే ఉంది అచ్చంగా. ఈ గదిలో సోఫాలో కూర్చుని తలకాయ అరచేతుల్లో పెట్టుకుని విచారంగా కూర్చుని ఉన్నాడు ఛటర్జీ.

రాజారావుని చూస్తూనే అతను లేచి నిలబడ్డాడు. రిమ్‌లేస్ కళ్ళజోడుని సవరించుకుని చూశాడు.

"మిస్టర్ ఛటర్జీ! నీ మనసేమైనా మార్చుకున్నావా? లేక ఇంకా మంకుపట్టుమీదే ఉన్నావా?" రాజారావు అడిగాడు.

"రాజారావ్! నీవు చేసిన పనికి నిన్ను జైలుకు పంపి తీరతాను" ఛటర్జీ అంత విచారంలోనూ కోపంగా అన్నాడు.

రాజారావు వికటంగా నవ్వాడు. "నీలాంటి తెలివి తక్కువ వాజమ్మలను ఎలా వంచాలో నాకూ తెలుసు! మీ అమ్మాయి సబిత నా చేతుల్లో ఉంది ఇప్పుడు!"

"ఏమిటీ! సవితను గూడ బంధించి తెచ్చావా? అయితే నీ రోజులు దగ్గర పడ్డాయన్న మాటే? నేను ఒక రోజు కనబడకపోయేసరికి, మా అమ్మాయి తప్పకుండా పోలీసు రిపోర్టు ఇచ్చే ఉంటుంది. ఏ క్షణాన అయినా నీ భవనం మీదకు దండెత్తి రావచ్చు పోలీసులు!"

"అదంతా నాకనవసరం! రాత్రి ప్రొద్దుపోయాక మళ్ళీ వస్తాను! మర్యాదగా ఒప్పుకుంటావా? లేక నీ కుమార్తె పతనాన్ని నీ కళ్ళారా చూసి ఒప్పుకుంటావో తేల్చుకో!" అంటూ రాజారావు వెళ్ళిపోయాడు విసురుగా.

12

రాజారావు మేడ దీపాలతో వెలిగిపోతున్నది. "ఏదో పార్టీ జరుగుతున్నట్టుందే! మన అనుమానం ఎంతవరకు నిజం కావచ్చు?" రామ్మూర్తి అనుమానంగా అడిగాడు.

"రాజారావుని నమ్మేందుకు వీల్లేదు. అందరి కళ్ళూ గప్పి, వాడు ఛటర్జీని, సవితనూ అపహరించుకు వచ్చి ఉంటాడు. అందుకు బలమైన ఎలిబీగా ఏదో పార్టీని ఏర్పాటుచేసి ఉంటాడు!" సారథి కారుని రోడ్డు ప్రక్కగా ఆపుతూ అన్నాడు.

"కారుని ఇక్కడాపి, మనం కాలినడకనే ఇంటి వెనుక భాగంలో జొరబడాలి!" సారథి కారు దిగాడు. అతడితో పాటు రామ్మూర్తి దిగాడు.

వారిద్దరి వెంట మరో వ్యక్తి వచ్చాడు. అతడి పేరు దాసు. దాసు ఆరడుగుల వ్యక్తి. కండలుదిరిగి, పుష్టిగ ఉంటాడు. తానొక్కడే నలుగురు మనుష్యుల్ని ఒకేసారి ఎదుర్కోగలడు. ఎప్పుడైనా అవసరం పడ్డప్పుడు సారథి అతడ్ని వెంట తీసుకురావడం పరిపాటే!

ముగ్గురూ మేడ వెనుకగా ఆవరణలోకి చేరుకున్నారు. మేడ దగ్గరకు చేరుకున్నారు.

దాసుని మాత్రం దూరంగా చెట్లచాటున ఉంచి, ఎవరైనా వస్తున్న అలికిడి అయితే సంకేతమివ్వమని కాపలాగా ఉంచారు.

సారథి తన జేబులోని తాళాల గుత్తి తీసి, గది తాళం తీయటానికి ప్రయత్నించాడు. కానీ అతడి ప్రయత్నం ఫలించలేదు.

"లాభంలేదు. ఈ తలుపు ఇనప్పెట్టె తలుపంత మందంగా ఉంది!" అంటూ పెదవి విరిచాడు సారథి.

వరండాకు దగ్గరగా చెట్లల్లో నక్కిఉన్న దాసు సంకేతమిచ్చాడు.

"అలా ప్రక్కకు తప్పుకుని దాక్కో! ఎవరో వస్తున్నట్టుంది!" అంటూ తప్పుకున్నాడు సారథ.

రామ్మూర్తి మరో ప్రక్కకు తప్పుకున్నాడు.

ఎవరో వ్యక్తి అటుగా వచ్చాడు. చీకట్లో గూడ అతడి ఆకారాన్ని పోల్చుకుని, అతడు రాజారావు కాదని రూఢి చేసుకున్నాడు సారథి.

ఆగంతకుడు చేతిలో ట్రే ఉంది. బహుశా సవితకు ఆహారం తెస్తున్నట్లున్నాడు కాబోలు! ఆగంతకుడు తన జేబులోంచి తాళంచెవి తీసి తలుపులో దూర్చి త్రిప్పాడు.

"పాపం! సవిత ఇంతదూరం ప్రయాణించి అలిసిపోయి ఉంటుంది!" అన్నాడు సారథి చీకట్లో, నెమ్మదిగా.

ఆగంతకుడు ఉలిక్కిపడ్డాడు. తన చేతిలోని ట్రేని క్రిందపెట్టి, చీకట్లో మాట వచ్చిన వేపుగా పిడికిళ్ళు బిగించి చూశాడు.

సారథి నవ్వాడు. గభాల్న కూర్చున్నాడు. ఆగంతకుడు గోడకు గుద్దుకున్నాడు. దాసు అతడికి వెనుకగా వచ్చి, ఎలుకని పట్టే పిల్లిలా ఆగంతకుడ్ని తన చేతుల్లో ఇరికించుకున్నాడు.

మరుక్షణంలో ఆగంతకుడు నేలకొరిగిపోయాడు. తన జేబులోంచి తాడు తీసుకుని అతడి కాళ్ళూ, చేతులూ కట్టి పడేశాడు. అతడి నోట్లో గుడ్డలు కుక్కి, తీసుకువెళ్ళి ఒక మూలగా దాచాడు దాసు.

దాసుని వరండాలోనే ఉంచి, సారథి, రామ్మూర్తి లోపలకు ప్రవేశించారు.

"ఈ తలుపుల తాళాలు గూడ ఎలెక్ట్రికల్‌గా ఆపరేట్ అవుతాయి కాబోలు! కాకపోతే, ఇంత మందంగా ఉన్న తలుపుకు ఇంత సన్నని తాళంచెవి ఏమిటి?" తలుపు వంక చూస్తూ అన్నాడు రామ్మూర్తి.

మెట్లు దిగి లోపలకు వెళ్ళారు. మరో తలుపు వచ్చింది. అదే 'కీ'తో ఆ తలుపు కూడా తెరుచుకుంది.

సోఫాలో కూర్చుని ఉన్న సవిత కంగారుగా లేచింది. అయితే ఆ వచ్చింది రాజారావు కాదనీ, తనను వెదుక్కుంటూ వచ్చిన సారథి, రామ్మూర్తి అని గ్రహించంగానే, ఆమె సంతోషానికి అవధి లేదు!

"ఏమిటిది? కలా? నిజమా? నన్ను ఎలా కనుక్కోగలిగారు?" అంది సవిత.

"యోగక్షేమాలు విచారించేందుకు ఇదేమీ రైల్వే ప్లాట్‌ఫారమ్ కాదు! ముందు నీ సంగతి చెప్పు! నిన్నేం హింసించలేదు గదా?" అంటూ రామ్మూర్తి ఆమె చేతి వ్రేళ్ళను తడిమి చూశాడు.

"రామ్మూర్తీ! ఆమెతో మాట్లాడుతూ, రాజారావు రాకను గూడా మరిచేవ్! జాగ్రత్తగా ఉండు! ఈలోపల నేను కొంచెం పని చూసుకుని వస్తాను!" అంటూ అక్కడ్నుంచి నడిచి మరో గదిలోకి వచ్చాడు సారథి.

ఆ గదిలో టేబుల్ మీద కలర్ టెలివిజన్ ఉంది' మరోవైపు అద్దాల బీరువాలో, గాజుపెట్టెలో చేతివ్రేళ్ళ నమూనాలు మైనంతో చేయబడినవి ఉన్నాయ్! వీటితోనే రాజారావు తన చేతివ్రేళ్ళ ముద్రలను ఫోర్జరీ చేసింది అనుకున్నాడు సారథి.

ఆ గదిలోంచి తిరిగి మొదటి గదిలోకి ప్రవేశించాడు సారథి.

"సవితా! మీ నాన్నను చూద్దువుగాని రా! ఆయన పాపం అలిసిపోయి నిద్రపోతున్నాడు!" అంటూ సారథి సవితను వెంటబెట్టుకుని మూడో గదిలోకి వెళ్ళాడు.

తండ్రి సోఫా కమ్ బెడ్ మీద పడుకుని నిద్రపోతున్నాడు. సవిత వెళ్ళి అతడ్ని కుదిపి లేపింది.

ఛటర్జీ కళ్ళు తెరచి సవిత వంక అయోమయంగా చూశాడు. తను కలగంటున్నానేమో అని, కళ్ళు నులుముకుని మరీ చూశాడు.

"నాన్నా! నేను! సవితను!" అంది సవిత అతడ్ని కుదుపుతూ.

"నేను కలగనటం లేదుగదా! సవితా! ఎలా రాగలిగావిక్కడికి?" అంటూ సారథి వంక తేరిపార చూశాడు. "ఎవరితడు? రాజారావు మనిషి కాదుగదా? నిన్ను బలవంతంగా తెచ్చాడా ఇక్కడకు?"

"లేదు నాన్నా! ఈయన మనల్ని రక్షించటానిక

వచ్చిన వ్యక్తి. బయట అతడి కారు సిద్ధంగా ఉంది. మనం వెంటనే బయలుదేరాలి!" సబిత తండ్రిని తొందరచేసింది.

"అంత తొందరేం లేదులే! రాజారావు గదులు చాలా సౌకర్యంగా ఉన్నాయ్! అతగాడి ఆతిథ్యం పొంది మరీ వెడదాం! నమస్తే ఛటర్జీ సాబ్! నా పేరు సారథి! ప్రైవేట్ డిటెక్టివ్‌ని. టెలివిజన్ గురించి మీకూ రాజారావుకూ ఒప్పందం కుదరలేదా?" అనడిగాడు సారథి.

"రాజారాజా? టెలివిజనా? ఆ సంగతి నీకెలా తెలుసు? నా కుమార్తెకు కూడా ఈ విషయం తెలియకుండా ఉంచానే?" ఛటర్జీ ఆశ్చర్యాన్ని వెలిబుచ్చాడు.

"అదంతా మనం తర్వాత తీరికగా చర్చించుకోవచ్చు. రాజారావు మిమ్మల్ని బలప్రయోగంచేత తన షరతులకు ఒప్పుకోమంటున్నాడా?"

సబిత అడ్డం వచ్చింది. "మనం ఇక్కడినుంచీ బయట పడితే నయం! లేదా మళ్ళీ ఆ రాజారావు రావచ్చు!"

"నేనుండగా మీకిద్దరకూ ఎలాటి ఆపదా రాదు! అదీ గాక రాజారావు రాత్రి ప్రొద్దుపోయేదాకా రాడు!" నిబ్బరంగా అన్నాడు సారథి.

అతడు ఆ గదిలోంచి బయటకు నడిచాడు. భూగర్భంలో నాలుగో గది తలుపు తాళం తీసి లోపలకు వెళ్ళాడు. ఆ గదిలో జనరేటరూ, ఎలెక్ట్రికల్ ట్రాన్స్‌ఫార్మర్‌లూ గది అంతా కరెంటు సామానుతో నిండి ఉంది. మెయిన్ స్విచ్‌లూ, స్విచ్ బోర్డు, పెద్ద స్విచ్‌లూ ఒకవైపు గోడను ఆక్రమించుకున్నాయ్.

మరో మూలగా ఇనుప నిచ్చెన బిగించి ఉంది. అది అత్యవసర పరిస్థితిలో పారిపోవటానికి ఉపయోగించే మార్గం.

అతడు తిరిగీ ఛటర్జీ గదిలోకి వెళ్ళాడు.

"సారథిగారూ! మిమ్మల్ని చూడంగానే అపార్థం చేసుకున్నాను. సవిత మీ సహాయం గురించి చెప్పింది. మీ మేలు జన్మలో మరచిపోలేను!" అన్నాడు ఛటర్జీ.

"నా సలహా ఏమంటే, మీరు ఇక్కడ్నుంచి బయట పడ్డాక, మీ సెట్‌ని ముందు పేటెంట్ చేయించండి! తర్వాత మీరు ఫ్యాక్టరీని స్థాపించేందుకు స్టేట్ బ్యాంకు నుంచి ఋణం పొందటానికి నేను సహాయపడగలను" సారథి సలహా ఇచ్చాడు.

"మీకు నా కృతజ్ఞతల్ని ఎలా తెలుపుకోవాలో అర్థం కావటంలేదు! అవునూ మీరు ఇంత సేపు నాతో తీరికగా మాట్లాడారు కదా? రాజారావు వస్తాడని భయం లేదా మీకు?"

"మనం ఏ క్షణాన తలుచుకుంటే ఆ క్షణానే బయటకు పోగలం. నా ఉద్దేశ్యం, రాజారావుతో ముఖాముఖి ఎదురుపడి అతడిచేతనే నిజాలు కక్కించాలని."

"మీరు నిజంగా గుండెలు తీసిన బంటులు సుమా!" అని మెచ్చుకున్నాడు ఛటర్జీ.

అంతలో గదిలో ఎర్ర లైటు వెలుగుతూ ఆరిపోవటం ప్రారంభించింది.

"అది దాసు సంకేతం! బహుశా రాజారావు వస్తూ ఉండాలి. త్వరగా తండ్రీ రెండో రూమ్‌లోనూ, కుమార్తె మొదటి రూములోనూ విచారంగా కూర్చోండి. పొరబాటున కూడా నా పేరెత్తవద్దు!" అన్నాడు సారధి.

ఛటర్జీ గదికి ఆనుకునే ఉన్న బాత్‌రూమ్‌లో సారథీ, రామ్మూర్తి దూరారు.

13

రాజారావు పార్టీకి వచ్చిన అతిథులందరికీ వీడ్కోలు చెప్పి భూగృహం వేపుగా వచ్చాడు. తను సబితకు ఆహారం పంపిన నౌకరు మళ్ళీ వెనక్కు రాలేదు. వాడేమైనాడా అని ఆశ్చర్య, సంభ్రమాలతో అతడు గబగబ నడిచాడు.

ఆ నౌకరూ ఒక నేరస్థుడే! పోలీసుల చేతుల్లో పడకుండా తనే వాడ్ని కాపాడి, తన దగ్గర పనికి పెట్టుకున్నాడు.

ఒకవేళ వాడు తనకు ద్రోహం తలపెట్టి పారిపోయాడు? వాడు నేరుగా ఏ పోలీస్ స్టేషన్‌కీ వెళ్ళలేదు కదా?

ఈ రాత్రి కలాగైనా ఛటర్జీ ఒప్పుకునేలా చేయాలి! ఇలా రోజులు సాగిన కొద్దీ ఏదైనా కొత్త ప్రమాదాలు ముంచుకురావచ్చు!

రాజారావు మెట్లుదిగి పాతాళ గృహం తాళం తీసి గదిలోకి ప్రవేశించాడు. ఇప్పటిదాకా అతడు ఏక్షణాన అయినా సారధి ఊడి పడతాడేమో అని భయపడి చస్తున్నాడు. అంతలోనే తను అనవసరంగా భయపడుతున్నానేమో అనుకున్నాడు.

సారధి ఎంత మొనగాడైనా గానీ, ఈ పాతాళ గృహం ఉనికిని ఎలా కనుక్కో గలడు? వాడి తల్లో జేజి కూడా ఇక్కడకు రాలేదు అని తనకు తనే ధైర్యం చెప్పుకున్నాడు.

అతడు ముందు సబిత దగ్గరకు వెళ్ళాడు. "మిస్ సబితా! నా డ్రైవర్ వల్ల నీకు జరిగిన బలప్రయోగానికి నేను మరోసారి క్షమాపణ చెప్పుకుంటున్నాను. నిజానికి

నీకు ఏ హానీ తలపెట్టలేదు. మీ నాన్న దగ్గరకు నిన్ను చేర్చాలనే నా అభిమతం."

"చూడండి రాజారావుగారూ! మీ క్షమాపణలూ బెదరింపులూ నా కక్కర్లేదు! మా నాన్నగారెక్కడున్నారో తక్షణం చూపించండి!" సబిత ఆడ పులిలా గర్జించింది.

"నేను వచ్చింది అందుకోసమే! ఆయన దగ్గరకు పోంగానే, నీవైనా ఆయనకు నచ్చచెప్పు! నాకు విరోధమంటే చెడ్డ అసహ్యం!" అంటూ రాజారావు సబితను వెంటబెట్టుకొని ఛటర్జీ గదిలోకి వెళ్ళాడు.

అప్పుడే మొదటిసారిగా తండ్రిని చూస్తున్న దానిలా "నాన్నా! నీకేం హాని జరగలేదు కదా!" అంది.

ఛటర్జీ ఆశ్చర్యంగా గుడ్లప్పగించి చూశాడు. "అయితే ఈ నరరూప రాక్షసుడు నిన్ను బంధించి తెచ్చాడా తల్లీ!" అన్నాడు కుమార్తెను తన చేతుల్లోకి తీసుకుంటూ.

"నీ తల బిరుసుదనమే నీ కుమార్తెను ఇక్కడకు రప్పించింది. నేను లోగడ చెప్పిన దాన్ని అంటే అయిదు శాతాన్ని పది శాతానికి హెచ్చిస్తున్నాను నీ వాటాని! నీవు ఒప్పుకుంటే ఇక్కడికిక్కడే అగ్రిమెంటు రాసుకుందాం! ఆ తర్వాత నీవూ నీ కుమార్తె లక్షణంగా వెళ్ళిపోవచ్చు!" రాజారావు ఆవేశంగా అన్నాడు.

ఛటర్జీకి బదులుగా సబిత జవాబిచ్చింది. "ఇదా నీ కపటనాటకం! నన్ను నా తండ్రి కళ్ళెదుటే హింసించి ఆయన చేత సంతకం పెట్టిద్దామనా నీ ఉద్దేశ్యం. అదెన్నటికి జరగదు. నాన్నా! నా ప్రాణాలు పోయినా సరే అతడితో నీవు రాజీ పడవద్దు!" అంది.

రాజారావు పళ్ళు పటపట కొరికాడు. "తండ్రికి తగ్గ కూతురి వనిపించుకున్నావ్! దీనికి ఫలితం మీరిద్దరూ అనుభవించాల్సి ఉంటుంది."

"నీ సంగతంతా సారధిగారు ఎప్పుడో చెప్పేశారు..." సబిత ఇంకేదో చెప్పేలోపలే, రాజారావు అడ్డు తగిలాడు.

"ఎవరూ? సారధా? వాడో హంతకుడు. దగాకోరు! వాడి మాటలా మీరు నమ్మేది! మిమ్మల్ని లక్షాధికారుల్ని చేయబోతున్నది నేను! కానీకి టికాణా లేని ఆ వెధవ మాటలు మీకు కూడు పెడతాయా?"

"ఏమైనా సరే! మానాన్నగారిక్క ముప్ఫయి శాతం వాటా ఇస్తేగానీ ఒప్పుకోరు! ఆపైన నీ ఇష్టం!"

"పదిశాతం కన్న ఎక్కువ దమ్మిడీ గూడా ఇచ్చేది లేదు."

బాత్ రూమ్ తలుపు తెరుచుకుని సారధి హఠాత్తుగా ప్రత్యక్షమయాడు. "అంతశ్రమ ఎందుకు రాజారావ్! ఆ పదిశాతం నీవే ఉంచుకో!" అన్నాడు, జేబులో చేతులు పెట్టుకొని.

అసలే సారధి పేరు వింటూనే ఉలిక్కిపడుతున్న రాజారావు, ఈ హఠాత్సంఘటనకు ప్రాన్పడిపోయాడు. కొద్ది సెకన్లు అక్కడ మానం తాండవించింది. సారధి కేసి గుడ్లప్పగించి చూస్తూండిపోయాడు రాజారావు.

"ఎవరూ? సారధే! నిజంగా!" అన్నాడు చివరకు గొంతు పెగల్చుకుని.

"అవును! నిజంగా సారధే!"

"ఎంత ధైర్యం నీకు! పులిబోనులోకి కుందేలు పిల్ల ఉరికినట్టు నా భూగృహంలోకి నీవే వచ్చావ్! నా గురించి

నీవు అతి ప్రమాదకరమైన రహస్యాల్ని సేకరించావ్! ఇకనిన్ను బ్రతక నివ్వటం నాకు క్షేమకరం కాదు!"

"నీ క్షేమం నాకు వదిలెయ్యి రాజారావు! నీవు రామారావు ఉరఫ్ లక్ష్మణరావుని హత్యచేసిన నేరానికి ఉరికంబం ఎక్కే రోజున, ఛటర్జీ కలర్ టెలివిజన్ ఫ్యాక్టరీకి ప్రారంభోత్సవం జరుగుతుంది!"

"రామారా వెవరో నాకు తెలీదు! అతడ్ని నేనెలా హత్యచేయగలను."

"నీవు నా వ్రేలి ముద్రల నమూనాలను తయారు చేయించ లేదా? అవి ప్రక్కగదిలో అల్మరాలో ఉన్నయ్; అంతకన్న సాక్ష్యం ఏం కావాలి, నీవే రామారావుని హత్య చేసినట్లుగా నిదర్శనం!"

రాజారావు ఒక్కక్షణం ఆలోచించాడు. ఈ సారధి అవులిస్తే ప్రేగులు లెక్కపెట్టే రకం! ఇతడి దగ్గర ఏవీ దాచి ప్రయోజనం లేదు. ఎటూ అతడ్ని తను ఈ పాతాళ గృహం నుంచి బయటపడనీయబోవటం లేదు. కనుక అతడికి యదార్థాన్ని చెప్పినా ఇబ్బంది లేదు అను కున్నాడు రాజారావు. సారధి చేతివ్రేలు జేబులోని అగ్గి పెట్టె సైజులోని టేప్ రికార్డర్ బటను నొక్కింది.

"అవును వాడు, ఆ రాస్కెల్ రామారావు పెద్ద బ్లాక్ మెయిలర్. నా నుంచి వాడు క్రమేపీ వేలకు వేలు లాగటం మొదలెట్టాడు. అందుకే అతడికి టిక్కెట్ ఇవ్వదలుచుకున్నాను. ఇచ్చేశాను. నా వ్యాపారంలో ఒకసారి నీవూ ప్రమేయం కల్పించుకుని అహమ్మద్ ఖాన్ ని జైలుకు పంపావ్! అందుకే ఆ హత్యా నేరాన్ని నీ మీదకు వచ్చేలా చేశాను," అంటూ రాజారావు సత్వరున వెనుదిరిగి తలుపు దగ్గరకు పరుగెత్తాడు.

కనురెప్ప పాటులో తలుపు మూసి బయట తాళం వేశాడు. ఆ తర్వాత జనరేటర్ రూమ్‌లోకి వెళ్ళి స్విచ్‌లన్నీ ఆఫ్ చేసేశాడు.

ఎయిర్ కండిషనర్‌లు పని చేయడం ఆగి పోయాయి, అన్ని గదుల్లోని లైట్లూ ఆరిపోయినయ్.

రాజారావు వికటంగా నవ్వాడు. ఇనుపనిచ్చెన మీదుగా ఎక్కి మేడలోని గదికి చేరుకున్నాడు. వేగంగా బయటకు వెళ్ళి కారులో కూర్చుని ఏక్సిలేటర్‌ని బలంగా త్రొక్కాడు.

కారు అరవయి మైళ్ళ వేగాన్ని అందుకుంది ట్రంక్ రోడ్డు మీద.

రామ్మూర్తి కంఠంలో ఆతృత గోచరించింది. "ఇప్పుడేమిటి దారి?" అన్నాడు.

సారథి తన జేబులోంచి మినీటార్చి తీసి వెలిగించాడు. మరో జేబులోంచి తాళం చెవిలాగి, తలుపులో దూర్చి త్రిప్పాడు.

"లాభంలేదు. ఈ తాళాలన్ని కరెంటు మీద పని చేస్తాయి. అందుకే అంత సన్నని చెవితో ఇంత దళసరి తలుపులు తేలికగా తెరుచుకున్నయ్!" అన్నాడు ధూర్జటి.

"ఇలాగే మనం ఉంటే ఏమవుతుంది?" అన్నది సవిత.

"రెండు గంటలలో ఈ గదిలో చెడువాయువు పేరుకుంటుంది. ఆక్సిజన్ అందక మనందరం ఊపిరాడక చచ్చిపోతాం!" రామ్మూర్తి బదులు చెప్పాడు.

"మనమేం క్షణాల్లో చావబోవటం లేదు! పాతాళ గృహం బయట దాసు ఉన్నాడని మరిచిపోకండి. ఎంత సేపటికీ మనం రాకపోవటం చూసి అతడు ఏదైనా సాయం తీసుకురావచ్చు!"

"అవును అదీ నిజమే! అనవసరంగా ఆదుర్దాపడి బ్లడ్ ప్రెషర్ తెచ్చుకోక, సోఫాల్లో హాయిగా విశ్రాంతి తీసుకోండి!" రామ్మూర్తి సూచన చేశాడు.

14

ఇన్స్పెక్టర్ రాజేంద్ర జీప్‌లో కూర్చున్నాడు, అతడి వెనుక ఇంకా నలుగురు పోలీసులు తుపాకులు పట్టుకొని కూర్చున్నారు.

జీప్ వేగంగా, రాజారావు కాటన్‌మిల్ వేపుగా పరుగిడుతోంది.

పోలీసులు రామారావు గదిని చివరిసారిగా వెతుకుతున్నప్పుడు గోడమీద పెన్సిల్‌తో రాసి ఉన్న టెలిఫోన్ నెంబరు కనబడింది. ఆ ఫోన్ నెంబరు రాజారావు ఆఫీసు ఫోన్‌ది.

ఇన్స్పెక్టర్ రాజేంద్ర రాజారావుని కలుసుకోవాలని అతడి ఆఫీసుకు వెళ్ళాడు. అక్కడ రాజారావు లేడు. ఆఫీసు సిబ్బంది తమలో ఎవరికి రామారావుతో పరిచయం లేదని వెల్లడించారు.

రాజారావు సెక్రటరీ మాత్రం, రామారావుని పోలిన వ్యక్తి అప్పుడప్పుడు వచ్చి రాజారావుతో మాట్లాడి వెళుతుండే వాడని చెప్పింది.

కనుక ఈ రామారావు ఉరఫ్ లక్ష్మణరావు అనే వ్యక్తి రాజారావుని తప్పకుండా బ్లాక్‌మెయిల్ చేస్తుండచ్చనీ, అందుకే అతడ్ని రాజారావు హత్యచేసే సావకాశం కలిగిందని మొదటి సారిగా అనుమానించాడు రాజేంద్ర.

రాజారావు కాటన్‌మిల్ దగ్గరి బంగళాలో పార్టీ ఏర్పాటు చేశాడని తెలుసుకుని హుటాహుటిని అక్కడకు

బయలుదేరాడు ఇన్స్పెక్టర్ రాజేంద్ర.

దోవలో అతడికి రాజారావు కారు ఎదురయింది. అపర మృత్యువులా, రోడ్డుమీద రాకెట్‌లా దూసుకు వస్తోంది కారు, మితిమీరిన వేగంతో.

"సార్! అది రాజారావు కారే!" అని అరిచాడు డ్రైవర్.

"ఎలాగైనా ఆ కారుని ఆపుచేయండి!" అన్నాడు రాజేంద్ర.

అందరూ జీప్‌లోంచి దిగారు జీప్‌ని రోడ్డు కడ్డంగా ఉంచి. అందరూ రోడ్డు ప్రక్కనే నిలబడ్డారు.

కారు వేగాన్ని తగ్గించుకుంటూ వచ్చింది. కానీ అప్పటికీ బ్రేక్ పడక, జీప్‌ని గుద్దేసింది.

పోలీసులు తుపాకులు ఫైర్ చేస్తూ, కారుని చుట్టుముట్టారు.

పోలీసుల్ని చూడంగానే రాజారావు ప్రాణాలు పైనే పోయినయ్.

15

ఆవరణలో కాలుగాలిన పిల్లిలా తిరుగుతున్న దాసు పోలీసుల్ని చూస్తూనే, "అయ్యా! సమయానికి వచ్చారు. పాతాళగృహంలో సారథి, రామ్మూర్తి, ప్రొఫెసర్ ఛటర్జి, ఆయన కూతురు సబిత సజీవంగా సమాధి చేయబడ్డారు. వాళ్ళని రక్షించండి!" అన్నాడు.

ఇద్దరు పోలీసులు ఇనుప నిచ్చెన మీదుగా ముందులోపలకు దిగారు. ఆ తర్వాత రాజారావు, ఇన్స్పెక్టర్ రాజేంద్ర దిగారు. మిగతా పోలీసులు పైన కాపలా ఉన్నారు.

రాజారావు వెళ్ళి స్విచ్‌లన్ని వేశాడు.

లైట్లు వెలిగినయ్. ఎయిర్ కండిషనర్లు పనిచేయటం

ప్రారంభించినయ్.

రాజారావు తన జేబులోంచి తాళం చెవి తీసి రాజేంద్ర కందించాడు.

ఇన్స్పెక్టర్ తలుపు తీసి లోపలకు వెళ్ళంగానే, లోపలున్న నలుగురూ "మీరా ఇన్స్పెక్టర్! సమయానికి వచ్చి రక్షించారు!" అని అతడ్ని చుట్టుముట్టారు.

సారథి మాత్రం "రాజారావెక్కడ?"అని అడిగాడు.

"వాడెక్కడికీ పోలేడు. వాడికి వెనుకా, ముందూ పోలీసులు కాపలా ఉన్నారు!" అన్నాడు రాజేంద్ర.

అదే సమయంలో ఎలక్ట్రిక్ పరికరాలున్న గదిలోంచి దిక్కులు పిక్కటిల్లేలా కేక వినబడింది.

అందరి శరీరాల్లోని రక్తం గడ్డకట్టుకు పోయింది ఆ కేకకు. ఎవరికి వారే వెర్రిగా ఆ రూమ్లోకి పరుగెత్తారు.

మెయిన్ స్విచ్ తెరచి అందులో తన రెండు చేతులూ దూర్చాడు రాజారావు. హైవోల్టేజీ కరెంట్ అవటం వల్ల, సెకన్లలోనే అతడి శరీరం విద్యుద్ఘాతానికి గురయింది, శరీరం నల్లగా కమిలిపోయింది.

"ప్చ్! ఎటూ ఉరిశిక్ష తప్పదని భయపడి, తనకు తానై ఆత్మహత్య చేసుకున్నాడు పాపం!" అన్నాడు రాజేంద్ర సానుభూతిగా.

"తను తీసుకున్న గోతిలో తానే పడ్డాడు!" ఛటర్జి పెదవి విరుస్తూ అన్నాడు.

-: ఐపోయింది :-